https://teluguislam.net



రెండవ దశ

# బహిరంగ దైవసందేశ ప్రచారం

## దైవసందేశ ప్రకటనకు ప్రథమ ఆదేశం

ఈ విషయంలో ప్రప్రథమంగా وَأَنذِرْ عَشِيرَتَكَ الْأَقْرَبِينَ 'వ అన్జిర్ అషీరతకల్ అఖ్రబీన్' (ఓ ప్రవక్తా! నీ దగ్గరి బంధువుల్ని (దైవ శిక్ష నుండి) హెచ్చరించు) అనే దైవవాణి అవతరించింది. ఇది దివ్యఖుర్ఆన్‌లోని షూరా అధ్యాయంలోని ఆయత్. ఈ అధ్యాయంలో మొదటగా హజ్రత్ మూసా (అ.స.)కు ఎదురైన పరిస్థితులను గురించి చెప్పడం జరిగింది. అంటే మూసా (అ.స.)కు దైవదౌత్య పదవి లభించిన ప్రారంభ దశ వివరాలు, చివరన ఆయన (మూసా-అ.స.) బనీ ఇస్రాయీల్‌తో సహా హిజ్రత్ చేసి ఫిర్ఔన్, ఫిర్ఔన్ జాతి నుండి విముక్తులైన తీరు, ఫిర్ఔన్, ఫిర్ఔన్ సహచరులు నీట ముంచబడిన వైనం వివరించి చెప్పడం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే, మూసా (అ.స.), ఫిర్ఔన్‌నూ మరియు ఫిర్ఔన్ జాతినీ అల్లాహ్ ధర్మం వైపునకు పిలవడానికి ఏయే పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందో వివరించడం జరిగిందన్న మాట.

దైవప్రవక్త (స)కు, తన జాతిలో బాహాటంగా ప్రచార కార్యక్రమం చేపట్టాలని ఆదేశం ఇవ్వబడ్డప్పుడు, మూసా (అ.స.)కు ఎదురైన పరిస్థితుల్ని ఏకరువుపెట్టడానికి గల కారణం, బాహాటంగా దైవమార్గం వైపునకు పిలవడం వలన సత్యనిరాకరణ, దౌర్జన్యాలు తప్పకుండా ఎదుర్కోవలసి వస్తుందని, మీరు (స), మీ అనుయాయులు దానికి సిద్ధమై ఉండాలని హెచ్చరిక చేయబడిందన్నది నా అభిప్రాయం.

మరో వంక, ఈ అధ్యాయంలో దైవప్రవక్తల్ని తిరస్కరించిన జాతులు, ఉదాహరణకు ఫిర్ఔన్ మరియు ఫిర్ఔన్ జాతే కాకుండా నూహ్ (అ.స.) జాతి, ఆద్, సమూద్ జాతులు; ఇబ్రాహీం (అస), లూత్ (అస) జాతులు,

https://teluguislam.net



అయికా ప్రజలు అనుభవించిన దుష్పరిణామాలేమిటో వివరించబడ్డాయి. దీని ఉద్దేశ్యం బహుశా, మహాప్రవక్త (స)గారి దైవదౌత్యాన్ని తిరస్కరించే వారికి, ఈ తిరస్కార వైఖరి నవలంబించడం వలన ఎలాంటి దుష్పరిణామాలను చవిచూడవలసి ఉంటుందో అని హెచ్చరిక, దైవధిక్కార నేరం క్రింద వారిని ఎలా శిక్షించటం జరుగుతుందో అన్న సత్యాన్ని విడమర్చి చెప్పడమే కాకుండా ప్రవక్త (స)ను విశ్వసించడం వల్ల ఎలాంటి బహుమానం లభిస్తుందో వివరించడమైనా అయి ఉండవచ్చు.

## దగ్గరి బంధువుల్లో సందేశ ప్రచారం

మొత్తానికి ఈ ఆయత్ అవతరించిన వెంటనే దైవప్రవక్త (స) చేసిన మొట్టమొదటి పని, బనీ హాషిం తెగవారిని ఓ చోట సమావేశపరచడం. వారి వెంట బనీ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్‌కు చెందిన ఓ వర్గం కూడా ఉంది. సమావేశమైనవారు మొత్తం నలభై అయిదు మంది. కాని అబూ లహబ్ అందుకొని, "ముహమ్మద్ (స), చూడు! వీరంతా నీ పినతండ్రులు, పినతండ్రి కుమారులు. వీరితో మాట్లాడు. కాని మూర్ఖత్వం వదిలెయ్యి. నీ కుటుంబం అరబ్బులందరిని ఎదుర్కోలేదు సుమా! నిన్ను వారించడానికి వీరందరికంటే నాకే హక్కు అధికం. కాబట్టి నీ తండ్రి కుటుంబమే నిన్ను అడ్డుకోవడానికి చాలు. నీవే గనక నీ మాట మీదనే నిలబడతానంటే మాత్రం ఖురైష్‌కు చెందిన తెగలన్నీ నీపైకి వచ్చిపడతాయి. మిగతా అరబ్బులు కూడా వారికి సహాయ పడతారు. తండ్రి కుటుంబాన్ని వినాశనానికి గురి చేయడానికి కారణభూతుడవు నీవే అవుతావు జాగ్రత్త!"అని ముగించాడు. ప్రవక్త (స) మౌనాన్ని వహించారు. ఆ సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదు.

ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) మరోమారు వారందరిని సమావేశపరచి ఇలా సెలవిచ్చారు: " స్తోత్రమంతా అల్లాహ్‌కే. నేను ఆయనను స్తుతిస్తున్నాను. ఆయన సహాయాన్ని కోరుకుంటున్నాను. ఆయనను విశ్వసిస్తున్నాను. ఆయననే నమ్ముకుంటున్నాను. అల్లాహ్ తప్ప ఆరాధనలకు అర్హుడెవడూ లేడని సాక్ష్యమిస్తున్నాను. ఆయన ఒక్కడే. ఆయనకు సాటి ఎవ్వరూ లేరు." తరువాత మాట్లాడుతూ, "మార్గం చూపేవాడు తన ఇంటి వారితో ఎన్నడూ అసత్యం పలుకలేదు. ఆరాధనలకు ఎవ్వరూ సాటిలేని ఆ దైవసాక్షిగా చెబుతున్నాను, ఈ మానవాళి

https://teluguislam.net



కోసం అల్లాహ్ తరపున పంపబడిన ప్రవక్తను నేను. దైవసాక్షి! మీరు పడుకొని నిద్రబోయినట్లే మరణాన్ని కూడా ఎదుర్కోవలసి ఉంది. ఎలా నిద్ర నుండి మేల్కొంటారో తిరిగి మళ్ళీ లేపబడతారు. తదుపరి మీరు చేసే ప్రతి కర్మకు లెక్క అడగబడుతుంది. ఆ తరువాత స్వర్గమో లేదా నరకమో శాశ్వ తంగా మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాయి."

అది విన్న అబూ తాలిబ్ ఇలా పలికారు:"కుమారా! నీతో ఎంత మట్టుకు సహకరించగలమో, నీ నీతి బోధ ఎంత వరకు సమ్మతమైనదో, నీ మాట ఎంత వరకు సత్యమైందన్న విషయాన్ని అడగకు! చూడు! నీ తండ్రి కుటుంబ సభ్యులంతా ఇక్కడనే చేరి ఉన్నారు. నేను కూడా వారిలోని ఓ వ్యక్తినే. తేడా ఏమిటంటే, నీ ఇష్ట పరిపూర్తికి వారందరికంటే ముందున్న వాణ్ణి. కాబట్టి నీకు ఏ ఆదేశమైతే వచ్చిందో దాన్ని నిర్వర్తించు. దైవసాక్షి! నేను నిన్ను సతతం కాపాడుతూ సహాయపడతాను. అయితే, నా మనస్సు అబ్దుల్ ముత్తలిబ్ ధర్మాన్ని వీడడానికి ఒప్పుకోవడం లేదు."

అబూ లహబ్ అందుకొని, "దైవసాక్షి! ఇది బహు చెడ్డ విషయం. ఇతరులు అడ్డుకోక పూర్వమే నీవు అతణ్ణి అడ్డుకో" అని అన్నాడు, దానికి జవాబుగా అబూ తాలిబ్, "దైవసాక్షిగా చెబుతున్నాను, నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకు నేను ఆయనను రక్షిస్తూనే ఉంటానని" చెప్పారు.[1]

## సఫా కొండ మీద...

అల్లాహ్ ధర్మ ప్రచార సందర్భంలో, పినతండ్రి అయిన అబూ తాలిబ్ దైవప్రవక్త (స)కు చేదోడు వాదోడుగా ఉంటారన్న ధైర్యం కలగగా, ఓ రోజు ప్రవక్తశ్రీ(స) సఫా కొండపైకెక్కి 'యా సబాహా'[2] (అయ్యో! ఓ ఉదయమా!!) అని కేక వేశారు. ఈ కేక విని ఖురైష్‌కు చెందిన తెగలన్నీ ఆయన దగ్గరకు చేరగా, దైవప్రవక్త (స) వారికి దేవుని ఏకత్వం, తన దైవదౌత్యం మరియు అంతిమ దినాన్ని విశ్వసించమని పిలుపునిచ్చారు. ఈ సంఘటనకు సంబంధించిన కొంత విషయం సహీ బుఖారి గ్రంథంలో ఇబ్నె అబ్బాస్ (ర) ద్వారా ఇలా ఉల్లేఖించడం జరిగింది:

---

1. ఫిక్హుస్సీరహ్-పుట. 77,88. ఇబ్నుల్ అసీర్ నుండి.
2. అరబ్బుల ఆచారం ప్రకారం, శత్రుదాడి గురించి తెలపాలంటే ఓ ఎత్తయిన ప్రదేశంపైకి పోయి ఈ పదాలే పలుకుతూ కేక వేసేవారు.

https://teluguislam.net



ఎప్పుడైతే 'వ అన్జిర్ అషీరతకల్ అఖరబీన్' ఆయత్ అవతరించిందో దైవప్రవక్త (స) సఫా కొండ మీదకు ఎక్కి ఖురైష్ తెగలను ఉద్దేశించి, "ఓ బనీ ఫహర్! ఓ బనీ అద్దీ!" అంటూ ఒక్కొక్కరి పేరు పెట్టి పిలిచి ఓ చోట సమావేశ పరచారు. అక్కడికి చేరలేని వాడు సైతం, విషయం ఏమిటో తెలుసుకురమ్మని తన మనిషిని అచ్చటికి పంపించాడు. మొత్తానికి ఖురైష్ అంతా వచ్చేశారు. అబూ లహబ్ కూడా అక్కడికి వచ్చాడు. ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) వారినందరిని ఉద్దేశించి, "ఈ కొండకు ఈవల లోయలో మీపై దండెత్తడానికి ఓ సైనిక పటాలం పొంచి ఉంది అని నేను చెబితే మీరు దీన్ని విశ్వసిస్తారా?" అని అడిగారు. ప్రజలంతా, "ఔను! మీరెప్పుడూ సత్యాన్నే చెబుతారన్న అనుభవం మాకుంది" అని ఏకకంఠంతో బదులు పలికారు. అప్పుడు దైవప్రవక్త (స), "అయితే చూడండి! నేను ఓ భయంకరమైన శిక్ష, యాతనల గురించి హెచ్చరించడానికి పంపబడినవాణ్ణి" అని హెచ్చరించారు.

ఇది విన్న అబూ లహబ్, "నీవు నాశనంగాను! మమ్మల్ని ఈ మాట చెప్పడానికే ఓ చోట కూడగట్టావా?" అని చిర్రుబుర్రులాడాడు. ఈ సందర్భం లోనే దివ్యఖుర్ఆన్ అధ్యాయం 'తబ్బత్ యదా అబీ లహబ్' అవతరించింది. "అబూ లహబ్ రెండు చేతులు నాశనమైపోవుగాక. అతనూ సర్వనాశనమై పోవుగాక" అని దీని అర్థం.[3]

ఈ సంఘటనకు చెందిన మరో భాగాన్ని ఇమామె ముస్లిమ్ తన గ్రంథం సహీలో అబూ హురైరా (ర) ఉల్లేఖించినట్లు రాశారు. ఆయన కథనం ప్రకారం, "వఅన్జిర్ అషీరత కల్ అఖరబీన్" అనే దైవవాణి అవతరించినప్పుడు దైవప్రవక్త (స) ఓ పిలుపునిచ్చారు. ఈ పిలుపు అందరినీ పిలిచిన పిలుపు. ఆయన ఖురైష్ తెగతో, "ఓ ఖురైష్ ప్రజలారా! మిమ్మల్ని మీరు నరకం నుండి కాపాడుకోండి, ఓ బనీ కఅబ్! మిమ్మల్ని మీరు నరకం నుండి రక్షించుకోండి. ఓ ముహమ్మద్ కూతురు ఫాతిమా! నిన్ను నీవు నరకం నుండి రక్షించుకో. ఎందుకంటే మిమ్మల్ని అల్లాహ్ (పట్టు)నుండి రక్షించే శక్తి నాకు లేదు. అయితే మీతో నాకు వంశం, బంధుత్వం రీత్యా సంబంధం ఉంది. ఆ సంబంధం ప్రకారమే మిమ్మల్ని హెచ్చ రించగలను."[4]

---

3. సహీ బుఖారి-2/702, 743; సహీ ముస్లిమ్-1/114.
4. సహీ ముస్లిమ్-1/114; సహీ బుఖారి-1/385.

https://teluguislam.net



ఈ పిలుపు కేవలం సందేశ ప్రచారార్థమే. దైవప్రవక్త (స), తన దగ్గరి బంధువులకు, తెగలకు, ఇక నుండి దైవదౌత్యాన్ని బలపరచడం మీదనే మన పరస్పర సంబంధాలు ఆధారపడి ఉంటాయని, ఏ జాతి, తెగల దురభిమానాల్లో అరబ్బులు చిక్కుకొని ఉన్నారో అవి దైవ హెచ్చరికతో అంతమైపోయాయని నిక్కచ్చిగా తెలియజేయడం జరిగింది.

## బాహాట సత్య ప్రకటనకు బహుదైవారాధకుల ప్రతిచర్య

ఈ నినాద ప్రతిధ్వని ఇంకా మక్కా చుట్టుపట్ల వ్యాపించిందో లేదో, అల్లాహ్ మరో ఆదేశాన్ని అవతరింపజేశాడు.

فَاصْدَعْ بِمَا تُؤْمَرُ وَأَعْرِضْ عَنِ الْمُشْرِكِينَ ۝

"ఫస్‌దఅ బిమా తూమరు వ ఆరిజ్ అనిల్‌ముష్రికీన్." (15-94)

*(కనుక ఓ ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడుతూ ఉండిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు. షిర్కు చేసే వారిని ఏ మాత్రం లెక్కచేయకు.)*

ఆ తరువాత దైవప్రవక్త (స), షిర్క్ (అల్లాహ్‌కు సాటి కల్పించడం) అంటే బహుదైవారాధన దురాచారాలను, దాని అసత్య పోకడలను ఎండగట్టనారంభించారు. విగ్రహాల యదార్థతను, వాటి రుగ్మతల్ని విడమర్చి చెప్పనారంభించారు. ప్రవక్తశ్రీ(స) ఉదాహరణలిస్తూ, ఈ విగ్రహాలు ఎంత వివశమైనవో, ఎంత పనికిమాలినవో, వాటిని ఆరాధించేవారు దైవానికి, ఈ విగ్రహాలకు నడుమ ఎలా సంబంధం ఏర్పరచుకున్నారో, వారు అవలంబించే ఈ వైఖరి ఎంత మూర్ఖమైనదో హేతుబద్ధంగా తర్కించి మరీ వివరించేవారు.

ముష్రిక్కులను (బహుదైవారాధకులను), విగ్రహారాధకులను, మార్గభ్రష్టులుగా నిందించినందుకు మక్కా నగరం అంతా ఆగ్రహం పట్టలేక మూకుమ్మడిగా ఆయనకు ఎదురు తిరిగింది. ఆశ్చర్య తిరస్కారాలతో ఊగిపోయింది. అంటే, అది ప్రశాంత వాతావరణాన్ని భయభ్రాంతులకు గురిచేసిన ఓ ఫెళఫెళారావమన్న మాట. అందుకని ఖురైషులు హఠాత్తుగా సంభవించిన ఈ విప్లవాన్ని వ్రేళ్ళతో సహా పెకలించడానికి లేచి నిలబడ్డారు. కారణం, దాన్ని సమర్థిస్తే తాతముత్తాతల నాటి నుండి వచ్చే ఆచార సంప్రదాయాలు పూర్తిగా తుడుచుకుపోతాయి అని వారి భయం.

అల్లాహ్‌యేతర శక్తుల దైవత్వాన్ని నిరాకరించడం; దైవదౌత్యాన్ని, ప్రళయ

https://teluguislam.net



దినాన్ని విశ్వసించడమంటే, తమను తాము పూర్తిగా దైవదౌత్యానికి అంకితం చేయవలసి ఉంటుందన్నది, ఆ మార్గాన్ని తు.చ. తప్పకుండా అనుసరించాల్సి ఉంటుందన్న విషయం ఖురైషులకు బాగా తెలుసు. అంటే, ఇతర విషయాలను ప్రక్కనబెట్టి, స్వయంగా తమ సంపదపైగాని, తమ ప్రాణాల విషయంలోగాని వారికి ఎలాంటి అధికారం ఉండబోదు. మరో విధంగా చెప్పాలంటే, మక్కావాసులకు ధార్మికంగా ఇతర అరబ్బులపై ఉన్న ఆధిక్యత, నాయకత్వం పూర్తిగా అంతం అయిపోతాయి. అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త ఇష్టానికి వ్యతిరేకంగా తమ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడానికి వీలుండదు. అంటే, బడుగు వర్గాలపై వారు ఏయే అత్యాచారాలు జరుపుతున్నారో, పొద్దస్తమానం ఏయే పాపాల్లో లీనమైపోయి ఉన్నారో వాటన్నింటిని ఒక్కసారిగా వదలి వేయవలసి వస్తుందని వారి బాధ. ఖురైషులు దీన్ని బాగా ఎరుగుదురు. అందుకని ఈ అవమానాన్ని భరించడం కోసం వారు ఏ మాత్రం సిద్ధంగా లేరు. ఇదంతా చేస్తున్నది, ఏదో గౌరవం పొందాలనో లేదా ఏదో ప్రయోజనం సమకూర్చుకోవాలనో మాత్రం కాదు. అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో చెప్పినట్లుగా, بَلْ يُرِيدُ الْإِنسَانُ لِيَفْجُرَ أَمَامَهُ ۝ **"కాని మానవుడు ఇక ముందు కూడా దుష్కార్యాలు చేయగోరుతున్నాడు"** (75-5) అనేదాని కోసం.

ఖురైషులకు ఇదంతా తెలుసు. అయితే వచ్చిన చిక్కల్లా, వారి ముందు ఉన్న వ్యక్తి సత్యసంధుడు, అమానతుదారుడు, మానవ విలువలు, నైతికతల ప్రతిబింబం. ఓ సుదీర్ఘ కాలం వరకు వారు తమ తాతముత్తాతల చరిత్రలో అలాంటి సద్గుణశీలుణ్ణి కనీవినీ ఎరుగరు. ఒకవేళ అతణ్ణి అడ్డుకోదలిస్తే అడ్డుకునేదెలా? ఈ విషయంలో వారు సంభ్రమాశ్చర్యాలకు లోనైపోయారు.

బాగా ఆలోచించిన తరువాత వారికి ఓ మార్గం అగుపించింది. ప్రవక్తశ్రీ (స) పినతండ్రి అబూ తాలిబ్ వద్దకు వెళ్ళి, ఆయన్ను ఆ కార్యం నుండి వారించమని నచ్చజెబుదాం అని తీర్మానించుకున్నారు. ఈ ప్రణాళికను విజయవంతం చేయడానికి వారు ఓ హేతువును కూడా కనుగొన్నారు. దాని ప్రకారం, ముహమ్మద్ (స) వారి ఆరాధ్యుల్ని వదిలేయమని చెప్పడం, వాటికి ఎలాంటి లాభనష్టాలను చేకూర్చే శక్తి లేదని చెప్పడం వగైరాలు. ఆ ఆరాధ్యులను నిందించడం లాంటిదనీ, గొప్ప దూషణ అనీ, అదే కాకుండా అదే మార్గంపై

https://teluguislam.net



నడిచిన తమ తాతముత్తాతల్ని మూర్ఖులు, మార్గభ్రష్టుల క్రింద జమ చేసినట్లు అవుతుందని నమ్మబలకడమే ఆ హేతువు. ఖురైషుకు ఈ పన్నాగమే సహేతుకమనిపించింది. ఇక ఆలస్యం చేయకుండా దాన్నే అనుసరించారు.

## అబూ తాలిబ్ వద్దకు వెళ్ళిన ఖురైష్ ప్రతినిధి బృందం

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఖురైష్‌కు చెందిన కొందరు పెద్ద మనుషులు అబూ తాలిబ్ ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడారు.

"ఓ అబూ తాలిబ్! నీ సోదర కుమారుడు మా దేవతల్ని నిందిస్తున్నాడు. మా మతాన్ని తప్పుపడుతున్నాడు. మేమంతా మందబుద్ధిగల వాళ్ళమట. మా తాత ముత్తాతలు మార్గభ్రష్టులట. నీవు ఆయన్ను అలా అనకుండా వారిస్తావా లేదా మా మధ్య నుండి తప్పుకుంటావా? నీవు కూడా మాలాగే అతను బోధించే ధర్మానికి వ్యతిరేకమైన ధర్మాన్నే అనుసరిస్తున్నావు కనుక, అతణ్ణి వారించడానికి మేము చాలు" అన్నారు. జవాబుగా అబూతాలిబ్ వారితో సద్వర్తనతో మెలుగుతూ ఏదో నచ్చజెప్పి వెనక్కు పంపించివేశారు. దైవప్రవక్త (స) మాత్రం తన మార్గాన్నే అనుసరిస్తూ అల్లాహ్ ధర్మాన్ని వ్యాపింపజేయడానికి సందేశాన్ని అందిస్తూనే ఉన్నారు.[5]

## హజ్ యాత్రికులు ప్రవక్త (స) మాటలను వినకుండా చేసేందుకు సలహా సంఘం ఏర్పాటు

ఆ రోజుల్లోనే ఖురైష్‌కు మరో చిక్కు ఎదురైంది. అంటే, బాహాటంగా దైవసందేశ ప్రచారం ఆరంభమై కొన్ని నెలలు గడిచాయో లేదో హజ్ కాలం వచ్చేసింది. అరేబియా మూలమూలల నుండి గుంపులు గుంపులుగా హజ్ యాత్రికులు మక్కాకు వస్తారన్న విషయం ఖురైషులకు బాగా తెలుసు. అందుకని ఆ హజ్ యాత్రికులు ముహమ్మద్ (స)గారి మాటలకు ప్రభావితులు కాకుండా ఉండాలంటే, ఏదో ఒకటి వారి మనస్సుల్లో నాటాల్సి వస్తుంది. కావున వారందరు ఈ విషయాన్ని చర్చించేందుకు 'వలీద్ బిన్ ముగైరా' ఇంట సమావేశమయ్యారు. వలీద్ ఇలా అన్నాడు: "ఈ విషయమై మీరందరూ ఒకే ఒక మాట మీద నిలబడాలి. మీలో ఎలాంటి అభిప్రాయభేదం ఉండడానికి వీల్లేదు. మీలోనే ఒకడు చెప్పింది మరో వ్యక్తి ఖండించకూడదు. చాలా జాగ్రత్తగా

5. ఇబ్నె హిషామ్-1/265.

https://teluguislam.net



ఉండాల్సి ఉంటుంది" అని అన్నాడు. "కానీయండి! ఏం చెబుతారో మీరే చెప్పండి" అని వారు ముగైరానే అడగ్గా, "లేదు, మీరే చెప్పండి. నేను వింటాను" అన్నాడు వలీద్. దానికి కొందరు ఇలా అన్నారు. "అతను (ముహమ్మద్ -స) ఓ కాహిన్ (జ్యోతిష్యుడు)". "లేదు, దైవసాక్షి! అతను కాహిన్ కాడు. మనం చాలా మంది కాహిన్‌లను చూశాం. అతనిలో కాహిన్లలో ఉన్న గొణుగుడు లేదు. వారిలా మాట్లాడేవాడూ కాదు."

"అలా కాకపోతే అతణ్ణి ఓ ఉన్మాదిగా చిత్రిద్దాం."

"అబ్బే! అతను ఉన్మాది కూడా కాడు. మనం చాలా మంది పిచ్చి వాళ్ళను, ఉన్మాదుల్ని చూశాం. వారి పరిస్థితిని కూడా గమనించినవాళ్ళం. ఆ వ్యక్తిలో ఉన్మాదుల్లాంటి ఏ సూచనా మనకు కానరాదు. వారిలా పిచ్చిపిచ్చి ప్రేలాపనలు కూడా అతను చేయడం లేదు."

"మరైతే అతను ఓ కవి అని వారిని నమ్మబలుకుదాం" అని వారు ఓ సలహా ఇచ్చారు.

దానికి వలీద్,"అతను కవి కూడా కాడు. మనకు కవిత్వానికి సంబంధించిన ఛందస్సు సైతం బాగా తెలుసు. మొత్తానికి అతను కవి కూడా కాడు."

"అతను ఓ ఇంద్రజాలికుడు అని చెబుదాం" అన్నారు అక్కడున్న వారిలో కొందరు.

"అతను ఇంద్రజాలికుడు కూడా కాడు. మనం ఇంద్రజాలికుల్ని, వారి జాల విద్యను కూడా చూసే ఉన్నాం. ఇతను వారిలా మంత్రాలు చదివి, త్రాళ్ళను ముడులుగా వేయడం లాంటివి ఏమీ చేయడం లేదు" అన్నాడు వలీద్ బిన్ ముగైరా.

"ఇవేమీ కాకపోతే మరేమని ఆ యాత్రిక బృందాలను నమ్మబలకగలం?" అని ప్రశ్నించారు వారు.

దానికి వలీద్ కల్పించుకొని, "దైవసాక్షి! అతని మాటలు అతి మధురమైనవి. అతని వ్రేళ్ళు పటిష్టమైనవి. దాని శాఖలు ఫలవంతమైనవి. మీరు ఏ మాట చెప్పినా దాన్ని అసత్యంగా భావిస్తారు వారు. అయితే, ఈ విషయంలో సరియైన మాట ఒక్కటే. అతను ఇంద్రజాలికుడు. అతను బోధించే వాణి అంతా ఇంద్రజాలమే. దాని ద్వారా తండ్రీకుమారుల్లో, అన్నదమ్ముల్లో, భార్యాభర్తల్లో, కుటుంబానికి కుటుంబానికి నడుమ చీలికలు ఏర్పడుతున్నాయి."

https://teluguislam.net



చివరికి వారంతా ఈ సలహాను ఏకీభవిస్తూ అక్కడి నుండి వెళ్ళి పోయారు.[6]

కొన్ని ఉల్లేఖనాల్లో, వలీద్ ఖురైష్ ప్రజలు ఇచ్చిన సలహాలన్నింటినీ త్రోసిపుచ్చగా, వారంతా నీవే మచ్చలేని సలహా ఏదైనా ఇవ్వమని అడిగారు. దానికి అతను, "ఆగండి. నన్ను కొంత ఆలోచించుకోనివ్వండి" అని చెబుతూ దీర్ఘంగా ఆలోచించి పైన చెప్పిన సలహాను వారి ముందుంచాడు.[7]

ఈ వ్యవహారానికే సంబంధించి వలీద్ విషయంలో ముద్దస్సిర్ సూరాలో పదహారు ఆయత్‌లు (11 నుండి 26) వరకు అవతరించాయి. వీటి లోని కొన్ని ఆయత్‌లలో అతని ఆలోచనా తీరు ఎలాంటిదో కూడా చెప్పడం జరిగింది. దివ్యఖుర్‌ఆన్‌లోని ఆ ఆయత్‌ల అర్థం ఇది:

إِنَّهُۥ فَكَّرَ وَقَدَّرَ ﴿١٨﴾ فَقُتِلَ كَيْفَ قَدَّرَ ﴿١٩﴾ ثُمَّ قُتِلَ كَيْفَ قَدَّرَ ﴿٢٠﴾
ثُمَّ نَظَرَ ﴿٢١﴾ ثُمَّ عَبَسَ وَبَسَرَ ﴿٢٢﴾ ثُمَّ أَدْبَرَ وَٱسْتَكْبَرَ ﴿٢٣﴾ فَقَالَ
إِنْ هَٰذَآ إِلَّا سِحْرٌ يُؤْثَرُ ﴿٢٤﴾ إِنْ هَٰذَآ إِلَّا قَوْلُ ٱلْبَشَرِ ﴿٢٥﴾

**"అతడు ఆలోచించి, ఏదో ఎత్తు వేయడానికి ప్రయత్నించాడు. కనుక దేవుడు అతనిని నాశనం చేయుగాక! అతడెలాంటి ఎత్తుగడ వేయడానికి ప్రయత్నించాడు! తరువాత (ప్రజల వైపు) చూశాడు. ఆ తరువాత కను బొమ్మలు ముడిచాడు. ముఖం చిట్లించుకున్నాడు. ఆపై విర్రవీగుతూ తిరిగి పోయాడు. చివరకు, ఇది పూర్వం నుండి వస్తూ ఉన్న ఒక మంత్రజాలం తప్ప మరేమీ కాదు, ఇది ఒక మానవ వాక్కు మాత్రమే." (74: 18-25)**

మొత్తానికి ఈ తీర్మానం జరిగాక దాన్ని అమలు చేసే పని మొదలైంది. కొందరు మక్కాకు చెందిన దైవతిరస్కారులు హజ్ యాత్రికులు వచ్చే వివిధ మార్గాల్లో కూర్చుని, ఆ మార్గాల ద్వారా ప్రయాణం చేసే హజ్ యాత్రికుల్ని ప్రవక్త (స) గారి నుండి వచ్చే ప్రమాదం గురించి హెచ్చరిస్తూ వివరాల నందించసాగారు.[8]

---

*6. ఇబ్నె హష్షామ్-1/271.*

*7. ఫీ జిలాలులు ఖుర్ఆన్-ఖుర్ఆన్ అధ్యాయం-29/188.*

*8. ఇబ్నె హష్షామ్-1/271.*

https://teluguislam.net



ఈ విషయంలో అబూ లహబ్ అందరికంటే చురుకుగా పాల్గొన్నాడు. అతను హజ్ కాలంలో యాత్రికుల విడుదులు మరియు ఉకాజ్, మజిన్నా, జుల్‌మజాజ్ సంతల్లో దైవప్రవక్త(స)ను వెన్నంటి ఉండేవాడు. ఆయన(స) దైవధర్మ ప్రచారం చేస్తుంటే దాన్నందుకుని అబూ లహబ్, ఈయన మాట వినకండి, ఇతను అసత్యవంతుడు, మార్గభ్రష్టుడైనవాడు అని ప్రవక్త(స) ప్రచారాన్ని ఖండించేవాడు.[9]

ఇలా ప్రజలు హజ్ యాత్ర పూర్తి చేసుకొని ఇళ్ళకు మళ్ళేనాటికి, ముహమ్మద్ అనే ఓ వ్యక్తి తాను దైవసందేశహరునిగా చెప్పుకుంటున్నాడన్న సత్యం వారికి తెలిసిపోయింది. హజ్ యాత్రికుల ద్వారా ఈ వార్త పూర్తి అరేబియాలో వ్యాపించిపోయింది.

## వ్యతిరేకతకు అవలంబించిన వివిధ ఎత్తుగడలు

ముహమ్మద్(స)ను దైవసందేశ ప్రచారం నుండి అడ్డుకోవడానికి ఈ విధానం పనిచేయడంలేదన్నది తెలిసిపోగానే, వారంతా తిరిగి ఆలోచనలో పడిపోయారు. దైవసందేశాన్ని వ్యాపించకుండాజేయడానికి అనేక విధానాల్ని అవలంబించనారంభించారు, వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

### 1. మొదటి రకం ఎత్తుగడ

ఎగతాళి, అవమానం, అపహాస్యం, నిరాకరణల ద్వారా బాధిస్తూ ముస్లిములను నిరుత్సాహపరచి వారి ధైర్యాన్ని నీరుకార్చడం. అందుకని బహు దైవారాధకులు దైవప్రవక్త(స)పై అపవాదులు వేస్తూ అసహ్యామైన పదజాలంతో ఆయన్ను దూషించేవారు. ఆయనను ఉన్మాదిగా చిత్రించేవారు. ఖుర్‌ఆన్ ఇలా అంటోంది:

وَقَالُوا يَا أَيُّهَا الَّذِي نُزِّلَ عَلَيْهِ الذِّكْرُ إِنَّكَ لَمَجْنُونٌ ۝

"దైవతిరస్కారులు ఇలా అంటారు: జిక్ర్ (దివ్యవాణి) అవతరించిన ఓ మనిషీ నీవు నిజంగానే పిచ్చివాడవు." (15-6)

ఒక్కోసారి ఇంద్రజాలికునిగా, అసత్యం పలికే మనిషిగా నిందించేవారు,

9. తిర్మిజీ, ముస్నదె అహ్మద్-3/492, 4/341.

https://teluguislam.net



وَعَجِبُوا أَنْ جَاءَهُمْ مُنْذِرٌ مِنْهُمْ وَقَالَ الْكَافِرُونَ هَٰذَا سَاحِرٌ كَذَّابٌ ۝

**"భయపెట్టేవాడొకడు స్వయంగా తమ నుండే వచ్చాడని వారు ఆశ్చర్య పడ్డారు. సత్యతిరస్కారులు ఇతను మంత్రవాది, అసత్యవాది అని అంటారు."** (38-4)

ఈ దైవతిరస్కారులు ఆయన వెనుక పగతీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో క్రోధావేశులై ఉద్రేకభావంతో నడిచేవారు. దీన్ని దివ్యఖుర్‌ఆన్ ఇలా చిత్రీకరిస్తోంది.

وَإِنْ يَكَادُ الَّذِينَ كَفَرُوا لَيُزْلِقُونَكَ بِأَبْصَارِهِمْ لَمَّا سَمِعُوا
الذِّكْرَ وَيَقُولُونَ إِنَّهُ لَمَجْنُونٌ ۝

**"ఈ అవిశ్వాసులు ప్రబోధవాణి (ఖుర్‌ఆన్)ని విన్నప్పుడు, వారు నీ కాళ్ళు ఊడగొడతారా అన్నట్లు నిన్ను కొరకొరా చూస్తారు. ఇతను తప్పకుండా పిచ్చివాడే అని అంటారు."** (68 : 51)

ఏ చోటనైనా ప్రవక్త(స) కూర్చుని ఉంటే, ఆయన చుట్టూ పీడితులు, బలహీనులు అయిన సహాబా(ర) కూర్చుని ఉండేవారు. వారిని చూసి ఈ బహుదైవారాధకులు అపహాస్యం చేస్తూ ఇలా అనేవారు:

أَهَٰؤُلَاءِ مَنَّ اللَّهُ عَلَيْهِمْ مِنْ بَيْنِنَا

**" ఓహో! మా నడుమ దయాదాక్షిణ్యాలు పొందిన వ్యక్తులు వీరేనా?" అని.** (6-53)

సమాధానంగా అల్లాహ్ అంటాడు :

أَلَيْسَ اللَّهُ بِأَعْلَمَ بِالشَّاكِرِينَ ۝

**"అవును! అల్లాహ్, కృతజ్ఞతలు చూపే తన భక్తులను, వీరికంటే బాగా ఎరుగడా?" (6 : 53)**

సాధారణంగా బహుదైవారాధకుల పరిస్థితి అంతా ఈ క్రింద చెప్పబడిన దివ్యగ్రంథంలోని ఆయత్‌లలో చెప్పినట్లుగానే ఉండేది.

إِنَّ الَّذِينَ أَجْرَمُوا كَانُوا مِنَ الَّذِينَ آمَنُوا يَضْحَكُونَ ۝ وَإِذَا مَرُّوا بِهِمْ
يَتَغَامَزُونَ ۝ وَإِذَا انْقَلَبُوا إِلَىٰ أَهْلِهِمُ انْقَلَبُوا فَكِهِينَ ۝ وَإِذَا رَأَوْهُمْ

https://teluguislam.net



قَالُوٓا۟ إِنَّ هَٰٓؤُلَآءِ لَضَآلُّونَ ۝ وَمَآ أُرْسِلُوا۟ عَلَيْهِمْ حَٰفِظِينَ ۝

"ప్రపంచంలో విశ్వసించిన వారిని నేరస్తులు హేళన చేస్తుంటారు. వారి ముందు నుండి వెళ్ళేటప్పుడు మాటిమాటికి కళ్ళుగీటుతూ వారి వైపు సైగలు చేసేవారు. తమ కుటుంబసభ్యుల దగ్గరకు వెళ్ళేటప్పుడు సంబర పడుతూ వెళ్ళేవారు. వారిని చూసినప్పుడు "వీరు దారితప్పారు" అని అనేవారు. వాస్తవానికి వారు వారిపై కాపలాదారులుగా నియమించ బడలేదు." (83-29 నుండి 33)

## 2. రెండవ రకం ఎత్తుగడ

దైవప్రవక్త(స)గారి బోధనలను వక్రీకరించడం, అనుమానాలను రేకెత్తించడం, అసత్యపు ప్రచారం. బోధనలకుతోడు వ్యక్తిత్వాన్ని కూడా అర్థంపర్థంలేని ఆక్షేపణలకు గురి చేయడం. ఈ ఎత్తుగడలన్నింటిని, ప్రజలు ప్రవక్తశ్రీ(స) బోధనల గురించి ఆలోచించకుండా ఆయన పిలుపును పెడచెవినబెట్టేటట్లు చేయడానికి పన్నిన ఎత్తులు. కాబట్టి దివ్యఖుర్ఆన్ బహుదైవారాధకుల ఈ ఎత్తుగడలను ఇలా తేటతెల్లం చేస్తోంది. దైవప్రవక్త మాటను విశ్వసించడానికి నిరాకరించిన వారు ఇలా అంటారు:

أَسَٰطِيرُ ٱلْأَوَّلِينَ ٱكْتَتَبَهَا فَهِىَ تُمْلَىٰ عَلَيْهِ بُكْرَةً وَأَصِيلًا ۝

"ఈ గీటురాయి ఒక కల్పన, దానిని ఇతనే స్వయంగా కల్పించాడు. ఇతరులు కొందరు ఈ పనిలో అతనికి సాయపడ్డారు." (25 : 4)

ఇంకా ఇలా అంటారు,

إِنْ هَٰذَآ إِلَّآ إِفْكٌ ٱفْتَرَىٰهُ وَأَعَانَهُۥ عَلَيْهِ قَوْمٌ ءَاخَرُونَ

"ఇవి పూర్వకాలంనాటి వారు వ్రాసిన విషయాలు. వాటికి ఇతను నకలు వ్రాయిస్తున్నాడు." (25 : 5)

బహుదైవారాధకులు ఇలా అంటూ ఉండేవారు కూడా.

إِنَّمَا يُعَلِّمُهُۥ بَشَرٌ

"దీన్ని (ఖుర్ఆన్‌ను) ఆయనకు ఓ మానవుడు నేర్పుతున్నదే." (16 : 103)

దైవప్రవక్త(స)ను వారు ఇలా ఆక్షేపణలకు గురిచేసేవారు.

https://teluguislam.net



مَالِ هٰذَا الرَّسُوْلِ يَأْكُلُ الطَّعَامَ وَيَمْشِيْ فِي الْأَسْوَاقِ ۚ

**"ఇతనేమి ప్రవక్త! అన్నం తింటాడు, బజారులలో తిరుగుతూ ఉంటాడు?"**
**(25 : 7)**

దివ్యఖుర్‌ఆన్ అనేక సందర్భాల్లో బహుదైవారాధకుల ఈ ఆక్షేపణల్ని వ్రేలెత్తిచూపుతూ మరికొన్ని సందర్భాల్లో పరోక్షంగానూ ఖండించింది.

## 3. మూడవ రకం ఎత్తుగడ

ఈ ఎత్తుగడ ప్రకారం పూర్వీకుల పౌరాణిక గాధల్ని దివ్య ఖుర్‌ఆన్‌కు పోటీగాపెట్టి వాటితోనే సతమతమయ్యేటట్లు ప్రజల్ని మభ్యపెట్టడం. నజ్ర్ బిన్ హారిస్ ఓసారి ఖురైషులతో ఈ విషయమై ప్రస్తావిస్తూ, "ఖురైష్ ప్రజలారా! దైవ సాక్షిగా మీపై ఓపెద్ద ఆపద వచ్చిపడింది. దానికి మీ వద్ద ఎలాంటి విరుగుడూ లేదు. ముహమ్మద్ యువకుడుగా మీ నడుమ ఉన్నప్పుడు మీకందరికి ఇష్ట మైన, నమ్మకమైన వ్యక్తిగా ఉంటూ ఉండేవాడు. అందరికంటే సత్యసంధుడు, గొప్ప అమానతుదారుడుగా మీరు ఆయనను కొనియాడేవారు. ఇప్పుడు ఆయన వెంట్రుకలు తెల్లబడిపోతూ (అంటే ప్రౌఢ వయస్సుకు చేరుకుంటున్నప్పుడు) కొన్ని హితోక్తులు మీ ముందు వల్లిస్తూ ఉంటే మీరు ఆయనను ఇంద్రజాలికు డంటున్నారు. కాదు! దైవసాక్షిగా చెబుతున్నాను, ఆయన ఇంద్రజాలికుడు కానేకాడు. ఇంద్రజాలికులను మనం చాలా మందిని చూశాం. వారు చేసే మంత్రతంత్రాలు, తాళ్ళను ముడివేసి వాటిపై ఊదడం కూడా మనం చూసిందే. మీరేమో ఆయన్ను కాహిన్ అంటున్నారు. కాదు, దైవసాక్షిగా! ఆయన కాహిన్ కూడా కాదు. కాహిన్‌లు చేసే తికమకలు, వారి ఉచ్ఛారణ కూడా మనకు తెలుసు. అలాగే మీరు ఆయన్ను కవి అని అంటున్నారు. కాదు, దైవసాక్షి! ఆయన కవి ఎంతమాత్రం కాదు. మనకు కవనం గురించి బాగా తెలుసు. పద్యానికి సంబంధించిన రకాలన్నీ మనం బాగా ఎరుగుదుము. మీరు ఆయనను ఉన్మాది అని అంటున్నారు. కానే కాదు. ఆయన ఉన్మాది కూడా కాదు. ఉన్మాదికి సంబంధించిన ప్రవర్తన కూడా మనం బాగా ఎరుగుదుము, ఉన్మాదిలో ఉండవలసిన లక్షణాలుగాని, పిచ్చిపిచ్చి మాటలుగాని, చేతలుగాని ఆయనలో కనబడవు. ఖురైష్ ప్రజలారా! ఆలోచించండి. దైవసాక్షి! మీపై పెద్ద ఆపదే వచ్చిపడింది సుమా!"

https://teluguislam.net



ఆ తరువాత నజ్ర్ బిన్ హారిస్ 'హీరా' నగరానికి వెళ్ళాడు. అక్కడ రాజుల కథలు, రుస్తుమ్, ఇస్ఫందార్ల వీరోచిత గాథలు చెప్పడం నేర్చుకున్నాడు. తిరిగివచ్చి, దైవప్రవక్త(స) ఎక్కడైనా కూర్చుని అల్లాహ్ ఔన్నత్యం గురించి బోధిస్తూ, ఆయన పట్టుకు భయపడవలసిందని హితోపదేశం చేస్తూ కనబడితే, నజ్ర్ బిన్ హారిస్ కూడా అక్కడికి చేరి,"దైవసాక్షి! ముహమ్మద్(స) మాటలు వినకండి. ఆయన చెప్పేవి నేను చెప్పేదానికంటే గొప్పవి ఏమీకావు" అంటూ పర్షియా రాజులు, రుస్తుమ్, ఇస్ఫందార్ల గాథలను వినిపించడం మొదలుపెట్టే వాడు. ఆ తరువాత, "ముహమ్మద్ చెప్పింది నేను చెప్పినదానికంటే మేలైనదని ఎలా అనుకుంటున్నారు?" అని ప్రశ్నించేవాడు.[10]

ఇబ్నె అబ్బాస్ (ర) గారి ఉల్లేఖనం ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, నజ్ర్ కొందరు పాటకత్తెలైన బానిసరాండ్రను కొని తన దగ్గర ఉంచుకున్నాడు. దైవప్రవక్త(స) వైపునకు మొగ్గు చూపుతున్నట్లు కనబడినవారి వద్దకు ఒక్కో పాటకత్తెను పంపించేవాడు. ఆమె ఆ వ్యక్తికి బాగా తినిపించి, త్రాగించి పాటలు వినిపించేది. చివరికి ఆ వ్యక్తిని ప్రవక్త(స) వైపునకు మొగ్గకుండా చూసేది. ఈ సందర్భంగానే దివ్యగ్రంథంలో ఈ ఆయత్ అవతరించింది.[11]

وَمِنَ النَّاسِ مَنْ يَشْتَرِي لَهْوَ الْحَدِيثِ لِيُضِلَّ عَنْ سَبِيلِ اللَّهِ

"అల్లాహ్ మార్గం నుండి తప్పించడానికి కొందరు ఆటపాటలను కొంటూ ఉంటారు." (లుఖ్మాన్-6)

### 4. నాలుగవ రకం ఎత్తుగడ

నచ్చజెప్పే మార్గం (సామోపాయం). బహుదైవారాధకులు, ఇస్లామ్ మరియు అజ్ఞానం రెండూ, మధ్యలో ఎక్కడో ఒకచోట పరస్పరం కలుసుకునే టట్లు పన్నాగం పన్నడం అన్నమాట. అంటే ఇచ్చిపుచ్చుకునే మార్గం అవలం బించడం వలన బహుదైవారాధకులు వారి నమ్మకాలను కొన్నింటిని వదలి వేయడం; దైవప్రవక్త(స) బహుదైవారాధకుల కొన్ని ఆచారాలను అవలం బించడం అన్నమాట. దివ్యగ్రంథం దీని గురించే ఇలా సెలవిస్తోంది.

---

*10. ఇబ్నె హష్షామ్-1/299,300,358; ముఖ్తసురుసీరహ్, షేక్ అబ్దుల్లా -117, 118.*
*11. ఫత్హుల్ ఖదీర్ లిల్ షూకానీ-4/236; మరికొన్ని సీరత్ గ్రంథాలు.*

https://teluguislam.net



وَدُّوا لَوْ تُدْهِنُ فَيُدْهِنُونَ ⑨

**“మీరు కొంత వంగిపోతే వారు కూడా కొంత వంగిపోవాలని చూస్తు న్నారు.”** (68 : 9)

ఇబ్నె జరీర్ మరియు తిబ్రానీల ఓ ఉల్లేఖనం ప్రకారం, బహుదైవారాధకులు దైవప్రవక్త ముహమ్మద్(స) ఎదుట, ఓ సంవత్సరం ఆయన వారి ఆరాధ్య దైవాలను పూజించాలని, మరో సంవత్సరం బహుదైవారాధకులు ప్రవక్త(స) గారి దైవం అల్లాహ్‌ను పూజిస్తారని ప్రతిపాదనను ఉంచారు, అబ్ద్ బిన్ హుమైద్ ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది: “బహుదైవారాధకులు (దైవప్రవక్త(స)తో), మీరు మా ఆరాధ్య దైవాలను స్వీకరిస్తే మేము కూడా మీ దైవాన్ని ఆరాధిస్తాము” అని పలికేవారు.[12]

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త(స) కాబా గృహ ప్రదక్షిణ చేస్తున్నారు. ఆ సమయంలో అస్వద్ బిన్ ముత్తలిబ్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా, వలీద్ బిన్ ముగీరా, ఉమయ్యా బిన్ ఖల్ఫ్ మరియు ఆస్ బిన్ వాయిల్ సహ్మీలు కలసి దైవప్రవక్త(స) కి ఎదురుగా వచ్చారు. వీరంతా వారి జాతికి పెద్ద మనుషులు దైవప్రవక్త(స) తో , “ఓ ముహమ్మద్(స)! రండి, మీరు ఆరాధించే దైవాన్ని మేమూ ఆరాధిస్తాము. మేము ఆరాధించే దైవాలను మీరు కూడా పూజించాలి. ఇలా ఈ కార్యంలో మీరు మేము ఏకం అవుదాం. ఇప్పుడు మీ ఆరాధ్యుడు మా ఆరాధ్యదైవాలకంటే మెరుగైన వాడు అయితే ఆయన్నుండి మేము మా వాటాను పొందుతాం. ఒకవేళ మా దైవాలు మీ దైవం కంటే మెరుగైతే మీరు కూడా మీ వాటాను పొందవచ్చు.” అని అధిక ప్రేలాపనలు చేశారు. దీనికి అల్లాహ్ పూర్తి అధ్యాయం ‘ఖుల్‌యా అయ్యుహల్ కాఫిరూన్’ను అవతరింపజేశాడు. ఇందులో, మీరు పూజించే వాటిని నేనెన్నటికీ పూజించ లేను అని ప్రకటించడం జరిగింది.[13] ఈ నిర్ణయాత్మకమైన సమాధానంతో వారి ఈ ఎత్తుగడ పూర్తిగా భగ్నం అయిపోయింది. ఉల్లేఖనాల్లో గల భేదానికిగల కారణం, ఈ ప్రయత్నం మాటిమాటికి జరిగి ఉండడం వల్లనే.

## హింసాదౌర్జన్యాలు

దైవదౌత్యపు నాలుగవ సంవత్సరం ఇస్లామీయ సందేశప్రచారం

12.ఫత్‌హుల్ ఖదీర్-5/508.

13. ఇబ్నె హిషామ్.

https://teluguislam.net



బహిర్గతమై నలువైపుల మారుమ్రోగుతున్న తరుణంలో, బహుదైవారాధకులు దాన్ని అణచివేయడానికి చేబట్టిన ఎత్తుగడలు, కుతంత్రాలను గురించి పైన చెప్పడం జరిగింది. ఇవన్నీ సమయానుసారం కొనసాగుతూపోయాయి. వారాలు, నెలలు గడచిపోయినా అంతకుతప్ప అడుగు ముందుకు వేయలేదు. ఇంకా దౌర్జన్యాన్ని, ఒత్తిడిని ప్రారంభించలేదు. అయితే వారి ఈ ఎత్తుగడలేవీ ఇస్లామీయ ధర్మప్రచారానికి అడ్డుకట్టవేయడంలో విఫలమౌతూ ఉన్న కారణంగా అందరూ తిరిగి ఓ చోట సమావేశమయ్యారు. ఇరవైఅయిదు మంది ఖురైషీ సర్దారుల ఓ కమిటీ ఎన్నుకోబడింది. దీనికి అధ్యక్షుడు దైవప్రవక్త(స) పినతండ్రి అబూ లహబ్. ఈ కమిటీ పరస్పర అవగాహనతో బాగా ఆలోచించి దైవ ప్రవక్త(స) మరియు ఆయన సహాబా(అనుచరగణం)కు వ్యతిరేకంగా ఓ తిరుగులేని తీర్మానాన్ని మంజూరు చేసింది. ఈ తీర్మానం ప్రకారం, ఇస్లామ్ ధర్మాన్ని వ్యతిరేకించడానికి ప్రవక్త ముహమ్మద్(స)ను బాధించడం, ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తూ ఉన్నవారిని రకరకాలుగా హింసించి వారిపై దౌర్జన్యం చేయడంలో ఎలాంటి లోటునూ రానివ్వకుండా చూడడం.[14]

బహుదైవారాధకులు ఈ తీర్మానాన్ని ఆమోదించి దాన్ని అమలు చేయడానికి గట్టి నిర్ణయం చేసుకున్నారు. ముస్లిములు, ముఖ్యంగా బలహీన ముస్లిముల విషయంలో ఈ పని చాలా తేలికైనది. అయితే దైవప్రవక్త(స) విషయంలో మాత్రం పెద్ద చిక్కులు వచ్చిపడతాయి. దైవప్రవక్త(స) వ్యక్తిగతంగా గౌరవనీయులు, మూర్తిమత్వంగలవారు. మిత్రులు, శత్రువులు సైతం ఆయన్ను గౌరవించేవారు. అలాంటి వ్యక్తికి ఎవరు ఎదురుబడ్డప్పటికి అతడు ఆయన్ను గౌరవ దృష్టితోనే పలుకరించేవాడు. ఓ పిచ్చిహిడే లేదా నీచుడే ఆయన ఎడల నీచంగా ప్రవర్తించగలడు. ఈ వ్యక్తిగత ఔన్నత్యమే కాకుండా ఆయనకు అబూతాలిబ్ అండదండలు కూడా ఉన్నాయి. అబూ తాలిబ్‌కు వ్యక్తిగత మరియు సమాజంలో వున్న పలుకుబడి కారణంగా, ఏ ఒక్కడూ ఆయన మాటకు ఎదురుచెప్పడం లేదా ఆయన కుటుంబ విషయాల్లో తలదూర్చే ధైర్యం చేయలేకపోయేవాడు. ఇలాంటి పరిస్థితి ఖురైష్‌ను పెద్ద చిక్కుల్లో పడవేసింది. అయితే ఏ సందేశమైతే వారి ధార్మిక పెత్తనాన్ని, ప్రాపంచిక నాయకత్వాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించబోతోందో, ఆ సందేశప్రచారం ఎడల

---

14. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/59,60.

https://teluguislam.net



ఎలా ఉపేక్ష చూపడం అన్నది కూడా ఓ గొప్ప ప్రశ్నే. ఎట్టకేలకు బహుదైవారాధకులు అబూ లహబ్ నాయకత్వంలో దైవప్రవక్త(స) మరియు ముస్లిములపై హింసా దౌర్జన్యాల పరంపరను ప్రారంభించారు. నిజానికి, ఖురైషులు ఈ విధానాన్ని ఆలోచించక పూర్వం నుండే అబూ లహబ్ వైఖరి మాత్రం దైవప్రవక్త(స) గారి ఎడల అంత కఠినంగానే ఉంటూ వచ్చింది. అతను బనీ హాషిమ్ సమావేశమైనప్పుడు చేసిన నిర్వాకం, ఆ తరువాత సఫా కొండపై ప్రవర్తించిన తీరు గురించి మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. కొన్ని ఉల్లేఖనాల్లో సఫా కొండపై అతను దైవప్రవక్త(స)ను కొట్టడానికి ఓ రాయిని కూడా చేతిలోకి తీసుకున్నట్లు ఉంది.[15]

దైవదౌత్యానికి పూర్వం అబూ లహబ్ ఇద్దరు కుమారులు 'ఉత్బా' మరియు 'తైబా'ల వివాహం దైవప్రవక్త(స)గారి ఇద్దరు కుమార్తెలు 'రుకయ్యా' మరియు 'ఉమ్మె కుల్సూమ్' తో జరిగి ఉంది. అయితే దైవదౌత్య పదవి లభించాక అతను ఎంతో కఠినంగా ప్రవర్తిస్తూ వారిద్దరికి తలాక్(విడాకులు) ఇప్పించాడు.[16]

అలాగే, దైవప్రవక్త(స) రెండవ కుమారుడు అబ్దుల్లాహ్ చనిపోయినప్పుడు అబూ లహబ్ ఎంతో సంబరపడిపోతూ తన మిత్రుల దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి, "ముహమ్మద్ 'అబ్తర్' (వంశహీనుడు) అయిపోయాడని" శుభవార్తనందించాడు.[17]

హజ్ కాలంలో అబూ లహబ్ దైవప్రవక్త(స) సందేశాన్ని ఖండించడానికి ఆయన వెనుకాల సంతల్లో జరిగే సమావేశాల్లోనికి వెళ్ళేవాడు అన్న విషయం మనకు తెలిసిందే. తారిక్ బిన్ అబ్దుల్లాహ్ ముహారబీ ఉల్లేఖనం ద్వారా తెలిసేదేమిటంటే, ఇతను కేవలం ఆయన్ను ఖండించడం మట్టుకే సరిపెట్టుకునే వాడుకాదు, రాళ్ళు కూడా విసిరేవాడు, ఆ రాళ్ళు విసరడం వల్ల ఆయన మడిమలు రక్తసిక్తమైపోయేవి.[18]

అబూ లహబ్ భార్య 'ఉమ్మె జమీల్' ఆమెను 'ఉర్వా'గా కూడా పిలుస్తారు. ఈమె హరబ్ బిన్ ఉమయ్యా కుమార్తె మరియు అబూ సుఫ్యాన్

---

15. తిర్మిజి.
16. ఫీ జిలాలిల్ ఖుర్ఆన్-30/282; తఫ్హీముల్ ఖుర్ఆన్-6/522.
17. తఫ్హీముల్ ఖుర్ఆన్-6/490,
18. జామె తిర్మిజీ.

https://teluguislam.net



సోదరి కూడా. ఆమె కూడా దైవప్రవక్త(స)ఎడలగల శత్రుత్వంలో తన భర్తకు ఏమీ తీసిపోలేదు. దైవప్రవక్త(స) నడిచే బాటలో, గుమ్మం ముందు రాత్రిపూట చీకటిలో ముళ్ళను పరిచేది. దుర్భాషలాడేది. తన నాలుకకు కళ్ళెం లేకుండా ప్రవక్త(స) గురించి దుష్ప్రచారం చేసేది. ఆయన(స)ను తిట్టి శాపనార్థాలు పెట్టడం నిందలు, అపవాదులు వేయడం, ఆయన(స)కు వ్యతిరేకంగా విషాన్ని వెదజల్లడం, భయంకర యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం ఆమె పనిగా పెట్టుకుంది. అందుకని దివ్యఖుర్ఆన్ ఆమెను 'హమ్మాలతల్ హతబ్'(కట్టెలు మోసేది) అనే ఖితాబునిచ్చింది (కట్టెలు మోయడం అంటే జగడాలు సృష్టిం చడం అనేది అరబిక్ సామెత).

దివ్య ఖుర్ఆన్‌లో తన భర్త అభిశంసన అవతరించిందన్న విషయం తెలుసుకోగానే దైవప్రవక్త(స)ను వెదుకుతూ బయలుదేరింది. మహాప్రవక్త(స) దైవగృహమైన కాబా దగ్గర మస్జిదె హరామ్‌లో కూర్చుని ఉన్నారు. ఆయన ప్రక్కన అబూ బక్ర్(ర) కూడా ఉన్నారు. కంకర రాళ్ళు ఆమె పిడికిట ఉన్నాయి. ముందుకు రాగానే దైవప్రవక్త(స) ఒక్కరే అగుపడకుండా అల్లాహ్ ఆమె దృష్టిని పోగొట్టాడు. కేవలం ఒక్క అబూబక్ర్(ర) నే చూడగలిగింది. ఆయన ముందుకు రాగానే, 'అబూ బక్ర్! నీ మిత్రుడెక్కడా? నన్ను తూలనాడుతున్నాడని నాకు తెలిసింది. అతనే గనక నాకు కనబడితే అతని ముఖంపై ఈ కంకరరాళ్ళు విసరికొడ్తా, నేను కూడా పద్యాలు చెప్పగలను" అని చెబుతూ ఇలా కవిత్వం చెప్పనారంభించింది."మేము 'ముజమ్మమ్'[19]ను ధిక్కరించాము, అతని ఆదేశాన్ని ఉల్లఘించాము, అతని ధర్మాన్ని అసహ్యదృష్టితో చూశాము, దాన్ని వదిలిపెట్టాము."

ఇలా చెప్పిన తరువాత వెనక్కు మరలి వెళ్ళిపోయింది. అబూ బక్ర్ (ర) దైవప్రవక్త(స)తో, "ప్రవక్తా! ఆమె మిమ్మల్ని చూడలేదా" అని అడిగారు. "లేదు, ఆమె నన్ను చూడలేదు. అల్లాహ్ ఆమెను గ్రుడ్డిదానిగా చేశాడు"[20] అని సమాధాన మిచ్చారు.

అబూబక్ర్ బజాజ్ కూడా ఈ సంఘటనను ఉల్లేఖించడం జరిగింది. ఆ ఉల్లేఖనంలో అదనంగా ఈ పదాలు కూడా ఉన్నాయి.

---

*19.* బహుదైవారాధకులు అక్కసుగా 'ముహమ్మద్' అనే పదాన్ని 'ముజమ్మమ్' అని పలికేవారు. ముహమ్మద్‌కు వ్యతిరేక పదం అది. ముహమ్మద్ అంటే శ్లాఘ నీయుడు అని, ముజమ్మమ్ అంటే నిందింపదగినవాడు అని అర్థం.

*20.* ఇబ్నె హిషామ్-*1/335, 336.*

https://teluguislam.net



"ఆమె అబూ బక్ర్(ర) దగ్గర నిలబడి, అబూ బక్ర్! నీ సహచరుడు మా 'హజ్జో' చేస్తున్నాడు (అంటే మమ్మల్ని కవనంలో తిడుతున్నాడు అని అర్థం) అని చెప్పగా, ఆయన దాన్ని ఖండిస్తూ, కాదు! ఈ కట్టడం యజమాని అయిన అల్లాహ్ సాక్షిగా! ఆయన కవిత్వం చెప్పడంగాని, దాన్ని వల్లించడంగాని ఎన్నడూ చేయలేదు అని అన్నారు. ఆమె దానికి నీవు నిజమే చెబుతున్నావు అని చెప్పి వెళ్ళిపోయింది."

అబూ లహబ్, దైవప్రవక్త(స)కు పొరుగువానిగా ఉంటూనే ఇలా ప్రవర్తిస్తూ ఉండేవాడు. అతని ఇల్లు ప్రవక్త(స) గారి ఇంటిని అనుకునే ఉండేది. అలాగే ఇతర పొరుగువారు కూడా ఆయన్ను ఆయన ఇంటిలో ఉన్నప్పుడు బాధలకు గురిచేస్తూ ఉండేవారు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త(స)ను ఆయన ఇంటిలో బాధించేవారు అబూ లహబ్, హకమ్ బిన్ అబిల్ ఆస్ బిన్ ఉమయ్యా, ఉక్బా బిన్ అబీ ముఅయిత్, అద్దీ బిన్ హమ్రా సకఫీ, ఇబ్నుల్ అస్దా హుజ్లీలు. వీరంతా ఆయనకు పొరుగున ఉంటున్నవారే. వీరిలో హకమ్ బిన్ అబిల్ ఆస్[21] తప్ప ఎవ్వడూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు. వారి హింసల తీరు ఎలా ఉండే దంటే, ఆయన(స) నమాజు చేస్తున్నప్పుడు వారిలో ఎవడో ఒకడు మేక గర్భాశయాన్ని ఆయనపై పడేటట్లు విసరేసేవాడు. పొయ్యిపై పాత్రను ఎక్కించి వారు మేక గర్భాశయాన్ని అందులో పడేటట్లు చేసేవారు. అది వారి వంటకపు ఆచారం. దైవప్రవక్త(స) ఇక చేసేదిలేక ఓ గూడు కట్టుకొని అందు నిలబడి నమాజు చేస్తూ తనను తాను రక్షించుకునేవారు.

మొత్తానికి ఈ అశుద్ధాన్ని ఆయనపై విసరినప్పుడల్లా ఆయన దాన్ని ఓ కర్రకు తగిలించుకొని బయటకు తెచ్చి గుమ్మంలో నిలబడి, "ఓ అబ్దె మునాఫ్! ఇదేనా పొరుగువారు చేసే పని" అని అడిగి దాన్ని పారవేసేవారు.[22]

ఉక్బా బిన్ ముఅయిత్ అయితే హింసాదౌర్జన్యంలో మరీ పెచ్చు పెరిగి పోయాడు. సహీ బుఖారీ గ్రంథంలో అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త(స) బైతుల్లాహ్(కాబా గృహం) వద్ద నమాజు చేస్తున్నారు. అబూ జహల్, అతని కొందరు మిత్రులు అక్కడనే కూర్చుని ఉన్నారు. అంతలో

---

*21. ఈయన ఉమవీ ఖలీఫా మర్వాన్ బిన్ హకం తండ్రి.*

*22. ఇబ్నె హష్షామ్-1/416.*

https://teluguislam.net



కొందరు మరికొందరిని సంబోధిస్తూ, "ముహమ్మద్ సజ్దా (సాష్టాంగం) చేసినప్పుడు, ఫలానా తెగకు చెందిన ఒంటె పొట్టపేగుల్ని ఆయన వీపుపై పెట్టడానికి ఎవరు సిద్ధపడతారు" అని సవాలు విసిరారు. దీనికి ఆ జాతికి చెందిన దురదృష్టవంతుడు- ఉక్బా బిన్ ముఅయిత్[23] ఆ ఒంటె పొట్ట పేగుల్ని ఎత్తుకు వచ్చి ప్రవక్త(స) సాష్టాంగపడేంత వరకు ఎదురు చూస్తూ నిలుచున్నాడు. ఆయన(స) సాష్టాంగపడగానే ఆ పొట్టప్రేగుల్ని ఆయన రెండు గూడల నడుమ పడవేశాడు. ఈ దృశ్యాన్ని చూస్తూ ఉన్న అబ్దుల్లా బిన్ మస్ఊద్, "నేను ఇదంతా చూస్తూనే ఉన్నాను కాని ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాను, ప్రవక్తను రక్షించే బలం నాకుంటే ఎంత బాగుండు!" అని వాపోయారు.

ఆయన కథనం ప్రకారం, ఆ ఒంటె పొట్టప్రేగుల్ని దైవప్రవక్త(స) పై పడవేసి వారు పట్టలేని ఆనందంతో ఒకరిపై ఒకరు పడి నవ్వుకుంటున్నారు. దైవప్రవక్త(స) అలా సజ్దాలోనే ఉండిపోయారు. తలపైకి ఎత్తలేకపోయారు. చివరికి హజ్రత్ ఫాతిమా(ర) వచ్చి ఆ అశుద్ధ పదార్థాన్ని ఆయన(స) వీపుపై నుండి తీసి క్రింద పడవేయడం జరిగింది. అప్పుడుగాని దైవప్రవక్త(స) తలపైకి ఎత్తలేకపోయారు. ఆ తరువాత ఆమె(ర), "ఓ అల్లాహ్! ఖురైష్‌ను పట్టుకో (శిక్షించు)" అని మూడుమార్లు శపించారు. ఈ శాపం ఖురైష్‌కు రుచించలేదు. ఎందుకంటే వారి నమ్మకం ప్రకారం, ఈ ప్రదేశం ప్రార్థనలు స్వీకరించబడే ప్రదేశం గనక. ఆ తరువాత దైవప్రవక్త(స) ఒక్కొక్కరి పేరు చెబుతూ ఇలా శపించారు: "ఓ అల్లాహ్! అబూ జహల్ ను శిక్షించు. ఉత్బా బిన్ రబీయాను, షైబా బిన్ రబీయాను, వలీద్ బిన్ ఉత్బాను, ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌ను మరియు ఉత్బా బిన్ అబీ ముఅయిత్‌ను శిక్షించు."

ఆయన(స) ఏడవ వ్యక్తి పేరు కూడా ఉచ్చరించారుగాని ఉల్లేఖనకర్తకు ఆ పేరు జ్ఞాపకం లేదు- ఇబ్నె మస్ఊద్ (రజిఅన్) తన ఉల్లేఖనంలో ఇలా చెబుతారు. "నా ప్రాణం ఏ దైవం అధీనంలోనైతే ఉందో ఆ దైవం సాక్షి! మహాప్రవక్త(స) ఎవరెవరి పేర్లనైతే ఆనాడు ఉచ్చరిస్తూ శపించారో వారంతా బద్ర్ యుద్ధంలో బావిలో మృతులుగా పడి ఉండడం కనబడింది.[24]

---

23. సహీ బుఖారీకే చెందిన మరో ఉల్లేఖనంలో ఇది వివరంగా చెప్పడం జరిగింది. చూడండి, 1/543.

24. సహీ బుఖారీ; కితాబుల్ వుజూ-1/37).

https://teluguislam.net



'ఉమయ్యా బిన్ ఖల్ఫ్' దైవప్రవక్త(స)ను చూడగానే దుర్భాషలాడడం పనిగా పెట్టుకున్న వ్యక్తి. అతని గురించే దివ్యగ్రంథంలో ఈ ఆయత్ అవతరించింది. 'వైలులిల్లికుల్లి హుమజతిల్ లుమజా' (ప్రజలను దెప్పిపొడవడంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచడంలో ఆసక్తి కనబరిచేవాడు సర్వనాశనమవుతాడు). ఇబ్నె హష్షామ్ కథనం ప్రకారం, హుమజా అనేవాడు బాహాటంగా దెప్పిపొడిచేవాడు, కన్నుగీటేవాడు అని; లుమజా అంటే పరోక్షంగా లోపా లను ప్రజల ముందుంచి వారిని అగౌరవంపాలు చేస్తూ బాధించేవాడని అర్థం.[25]

ఉమయ్యా సోదరుడు ఉబై బిన్ ఖల్ఫ్, ఉక్బా బిన్ అబీ ముఅయిత్‌లు ప్రాణస్నేహితులు. ఓసారి ఉక్బా, దైవప్రవక్త(స) దగ్గర కూర్చుని ఆయన చెప్పిన మాటల్ని విన్నాడు. ఈ విషయం ఉబైకి తెలిసింది. అతను ఉక్బాను గట్టిగా మందలించాడు. అదే కాకుండా వెళ్ళి దైవప్రవక్త(స) ముఖంపై ఉమ్మేసి రమ్మని పురమాయించాడు. చివరికి ఉక్బా, ఉబై చెప్పినట్లుగానే చేసివచ్చాడు. స్వయంగా ఉబై బిన్ ఖల్ఫ్ ఓసారి చీకిపోయిన ఎముకను తెచ్చి నుజ్జునుజ్జుగా చేసి దైవప్రవక్త(స) వైపు గాలిలో ఊదేశాడు.[26]

అక్నస్ బిన్ షురైఖ్ సఖఫీ అనేవాడు కూడా దైవప్రవక్త(స)ను హింసించేవారిలో ఒకడు. దివ్యఖుర్ఆన్‌లో అతని తొమ్మిది అవలక్షణాలు వివరించడం జరిగింది. దాని ద్వారా అతని ప్రవర్తన ఎలాగుండేదో అర్థమవుతుంది.

وَلَا تُطِعْ كُلَّ حَلَّافٍ مَّهِينٍ ﴿١٠﴾ هَمَّازٍ مَّشَّآءٍ بِنَمِيمٍ ﴿١١﴾ مَّنَّاعٍ لِّلْخَيْرِ
مُعْتَدٍ أَثِيمٍ ﴿١٢﴾ عُتُلٍّ بَعْدَ ذَٰلِكَ زَنِيمٍ ﴿١٣﴾

**"చీటికీమాటికీ ఒట్టువేసే నీచుడికి ఎంతమాత్రం లొంగకు. వాడు ఎత్తిపొడుస్తూ ఉంటాడు, చాడీలు చెబుతూ తిరుగుతూ ఉంటాడు. మంచిని నిరోధిస్తూ ఉంటాడు. దౌర్జన్యం చేయడంలోనూ, అత్యాచారం చేయడంలోనూ హద్దులు మీరుతూ ఉంటాడు. పరమ పాతకుడు, మిక్కిలి క్రూరుడు. ఈ లోపా లన్నిటితోపాటు వాడు హీనజన్ముడు కూడాను ."** (68 : 10-13)

అబూ జహల్ అప్పుడప్పుడు దైవప్రవక్త(స) వద్దకు వచ్చి దివ్యఖుర్ఆన్ వింటూ ఉండేవాడు. అయితే అది కేవలం వినడం మట్టుకే. విశ్వసించడంగాని, దాన్ని గౌరవించి భయపడడంగాని చేసేవాడు కాదు. అతను దైవప్రవక్త(స)ను

---

25. ఇబ్నె హష్షామ్-1/356, 357

26. ఇబ్నె హష్షామ్-1/361, 362.

https://teluguislam.net



తన సూటిపోటి మాటలతో బాధించేవాడు. దైవమార్గావలంబనను అడ్డుకునే వాడు. పైగా తన నిర్వాకానికి గర్వపడుతూ అక్కడి నుండి వెళ్ళిపోతూ తానేదో ఘనకార్యం చేసినవాడిలా ఫీలయ్యేవాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇతని ఈ ప్రవర్త నను వివరిస్తూ ఈ క్రింది వాక్యాలు అవతరించాయి. "ఫలాసద్దఖవలాసల్లా" (చివరి వరకు).[27]

అర్థం:- "కాని అతను సత్యాన్ని నమ్మలేదు, నమాజునూ చేయలేదు, అంతేకాదు తిరస్కరించి ముఖం తిప్పుకున్నాడు. ఆ తరువాత నిక్కుతూ, నీల్గుతూ తన ఇంటి వారి దగ్గరకు వెళ్ళిపోయాడు. ఈ వైఖరి నీకు మాత్రమే చెల్లుతుంది! నీకు మాత్రమే శోభిస్తుంది." (75 : 31 -35)

మొదటి రోజున దైవప్రవక్త(స)ను నమాజు చేస్తూ చూసి ఆ రోజు నుండే ఆయన్ను నమాజు చేయకుండా అడ్డుకోనారంభించిన వ్యక్తి అతను. ఓసారి మహాప్రవక్త(స) ముకామె ఇబ్రాహీం (కాబాగృహానికి ఆనుకొని ఉన్న ఓ స్థలం) వద్ద నిలబడి నమాజు చేస్తున్నారు. అతనది చూసి, "ముహమ్మద్(స)! నిన్ను నమాజు చేయొద్దని నేను వారించలేదా?" అని అడుగుతూ బెదిరించాడు. దానికి దైవప్రవక్త(స) కూడా అంతే బెదరింపుతో సమాధానం ఇచ్చారు. ఇది చూసి అతను, "ఓ ముహమ్మద్(స)! నన్ను బెదిరిస్తున్నావా? చూడు, ఈ మక్కా నగరంలో నా అనుయాయులు పెద్ద సంఖ్యలో ఉన్నారు సుమా" అని బడాయి ప్రకటించగా, అల్లాహ్ దానికి సమాధానంగా ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని అవతరింపజేశాడు. "ఫల్ యద్‌వునాదియహ్" (చివరి వరకు).[28]

అర్థం:- "అలానా! అయితే నీవు నీ అనుయాయి బృందాన్ని పిలుచుకురా (మేమూ శిక్షించే దైవదూతల్ని పిలుస్తాం)."

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: దైవప్రవక్త(స) అతని మెడ దగ్గర చొక్కాను పట్టుకొని ఊపుతూ, "అవ్‌లా లక ఫఅవ్‌లా! సుమ్మ అవ్‌లాలక ఫఅవ్‌లా" అని అన్నారు.

అర్థం:- ఈ వైఖరి నీకు మాత్రమే చెల్లుతుంది! నీకు మాత్రమే శోభిస్తుంది.

దానికి ఆ దైవవిరోధి, "ఓ ముహమ్మద్(స)! నన్ను బెదిరిస్తున్నావా! దైవ

27. ఫీ జిలాలుల్ ఖుర్‌ఆన్-29/212. 28. ఫీజిలాలుల్ ఖుర్‌ఆన్-30/208.

https://teluguislam.net



సాక్షి!! నీ దేవుడూ, నీవూ కలసి నన్నేమీ చేయలేరు. నేను ఈ మక్కా నగరానికి ఇరువైపులా ఉన్న రెండు కొండల నడుమ నడిచే వారిలో అందరికంటే గౌరవ నీయుణ్ణి సుమా" అని విర్రవీగాడు.[29]

మొత్తానికి దైవప్రవక్త(స) ఇంత గద్దించినా అబూ జహల్ మాత్రం తన వైఖరిని వీడలేదు. మరింత చెలరేగిపోయాడు. సహీ ముస్లిమ్‌లో అబూ హురైరా (ర) ఉల్లేఖనం ఇలా ఉంది.

"ఓ రోజు అబూ జహల్ (ఖురైష్ సర్దారులను సంబోధిస్తూ), "ముహ మ్మద్(స) మీ ముందే తన ముఖానికి మట్టిని పులుముకుంటున్నాడు కదా (అంటే సజ్దా చేస్తున్నాడని అర్థం. ఇది కక్షతో పలికిన పలుకులు)" అని అనగా వారు 'అవును' అని సమాధానమిచ్చారు. దానికి అతను, "లాత్, ఉజ్జా దేవుళ్ళ సాక్షి! నేను అతణ్ణి (ఈ పరిస్థితిలో) గనక చూస్తే, అతని మెడను కాళ్ళ క్రింద వేసి త్రొక్కేస్తాను, అతని ముఖాన్ని మట్టి పట్టేటట్టు నలిపేస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు. ఆ తరువాత అతను దైవప్రవక్త(స)ను నమాజు చేస్తూ ఉండగా చూసి ఆయన మెడను త్రొక్కేద్దామనే ధీమాతో ఆయన వైపునకు కదిలాడు. అయితే, వెంటనే అతను తిరుగుముఖం పట్టి వచ్చేయడం, తన రెండు చేతులతో దేనినుండో రక్షణ పొందడానికి ఊపుతున్నట్లుగా అక్కడున్నవారంతా గమనిం చారు. వారంతా అతణ్ణి ఉద్దేశించి, "ఓ అబుల్ హకం! నీకేమైంది?" అని అడిగారు. దానికి అతను సమాధానంగా "నాకూ, ఆయనకూ నడుమ ఓ అగ్ని గుండం అడ్డంగా ఉంది. అబ్బో అది ఎంతో భయాన్ని గొలుపుతోంది" అని చెప్పాడు. తరువాత దైవప్రవక్త(స) ఈ సంఘటనను వివరిస్తూ, "అతనే గనక నా దగ్గరకు వచ్చి ఉంటే దైవదూతలు అతని అవయవాలను ఒక్కొక్కటిగా మాయం చేసేవారే"అని సెలవిచ్చారు.[30]

దైవప్రవక్త(స)గారి ఎడల ప్రజల్లో ఉన్న మర్యాద, గౌరవం, అందరిలో కెల్లా ఆయన ప్రత్యేక వ్యక్తిత్వం, ఔన్నత్యం విషయంలో ఎంతమాత్రం సందేహం లేదు. అయినప్పటికి ఆయనపై ఈ హింసాదౌర్జన్యాలు, ఆగడాలు జరుగుతూనే ఉన్నాయి. మక్కాలో ఆయన అందరికంటే గౌరవనీయుడు. దానికితోడు అబూ తాలిబ్ ఆయనను రక్షణ కవచంగా కాపాడుతూనే ఉన్నా అంత కఠినంగా హింసించడం జరుగుతూనే ఉంది. ఇక సాధారణ ముస్లిము

---

29. ఫీ జిలాలుల్ ఖుర్ఆన్-29/312. 30. సహీ ముస్లిమ్.

https://teluguislam.net



లపై జరుగుతున్న ఆగడాలు సరేసరి. ముఖ్యంగా వారిలోని బలహీన వర్గాలకు చెందినవారిపై జరుపుతున్న అత్యాచారాలకు ఇక అడ్డేముంటుంది. అవి మరింత దారుణంగా, భయంకరంగా ఉండేవి. ప్రతి తెగ, ముస్లిములుగా మారిన తనవారిని రకరకాలుగా శిక్షించేది. ఇక తెగ, వంశం ఏదీ లేని అనామకులపై అక్కడి అల్లరిమూకల్ని ఉసిగొల్పి ఖురైషు సర్దారులు ఆనందించే వారు, ఆ ఆగడాలను విని ఎంత కఠిన హృదయుడైనా చలించిపోతాడు.

అబూ జహల్, ఎవరైనా ఘరానా వ్యక్తి మరియు పలుకుబడిగలవాడు ముస్లిముగా మారాడు అన్న వార్త వినగానే అతణ్ణి తిట్టిపోసేవాడు, అగౌరవ పరిచేవాడు. ఆస్తిపాస్తులు, డబ్బు హోదాలను మంటకలుపుతానని బెదిరించే వాడు. ఇక బలహీనుడెవరైనా ఇస్లామ్ ధర్మం స్వీకరించాడని తెలిస్తే అతణ్ణి చితకబాదేవాడు. ఇతరుల్ని బాదమని, హింసించమని పురిగొలిపేవాడు.[31] హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్(ర) గారి పినతండ్రి ఆయన్ను ఖర్జూరపు ఆకుల చాపలో చుట్టి, క్రింది నుండి పొగ వేసేవాడు.[32]

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ ముస్లిమ్ అయ్యాడని తెలియగానే ఆయన తల్లి ఆయనకు అన్నపానీయాలు పెట్టకుండా ఇంటి నుండి వెళ్ళగొట్టింది. ఈయన ఎంతో సుకుమారంగా పెరిగిన వ్యక్తి. వాతావరణ పరిస్థి తుల ప్రభావం వల్ల ఆయన దేహంపై చర్మం అంతా ఊడిపోయి కుబుసం విడిచిన పాములా తయారయ్యారు.[33]

హజ్రత్ బిలాల్(ర), ఉమయ్యా బిన్ ఖల్ఫ్ హుమ్జయీకి బానిస. ఉమయ్యా ఆయన మెడలో త్రాడువేసి పోకిరి పిల్లల చేతికి ఇచ్చేవాడు. వారు ఆయన్ను మక్కా కొండల్లో త్రిప్పేవారు. అలా త్రిప్పడం వలన త్రాడు గుర్తులు ఆయన మెడపై పడేవి. స్వయంగా ఉమయ్యా ఆయన్ను కట్టేసి కర్రలతో చితక బాదేవాడు. మధ్యాహ్నం మండుటెండలో బలవంతంగా కూర్చుండబెట్టేవాడు. అన్నపానీయాలు ఇవ్వకుండా పస్తులుంచేవాడు. అంతకంటే మించిన దౌర్జన్యం ఏమిటంటే, మధ్యాహ్నం ఎండ బాగా తీవ్రమైనప్పుడు మక్కాలోని రాళ్ళుదేలిన ప్రదేశంలో పడుకోబెట్టి ఆయన ఛాతీపై బరువైన బండరాయి పెట్టించి ఇలా

---

31. ఇబ్నె హష్షామ్-1/320. 32. రహ్మతుల్ లిల్ ఆలమీన్.
33. రహ్మతుల్ లిల్ ఆలమీన్ 58; తల్ఖీహ్ ఫహుమ్ అహలుల్ అసర్-60.

https://teluguislam.net



చెప్పేవాడు; "దైవసాక్షి! నీవిలానే పడి ఉంటావు. చివరికి నీ ప్రాణం పోతుంది. ముహమ్మద్(స)ను తిరస్కరించు, బ్రతికిపోతావు" అని. హజ్రత్ బిలాల్ (ర) ఆ పరిస్థితిలోనే 'అహద్' 'అహద్' (ఒక్కడే, ఒక్కడే) అని పలికేవారు. ఓ రోజు ఇలాంటి సంఘటనే జరుగుతూ ఉండగా అటు నుంచి హజ్రత్ అబూ బక్ర్(ర) వెళుతూ చూశారు. ఆయన బిలాల్(ర)ను ఓ నల్లని నీగ్రో బానిసకు బదులుగా కొనేశారు. మరో ఉల్లేఖనం ప్రకారం, రెండొందల దిర్హమ్‌లకు (735 గ్రాముల వెండి)లేదా 280 దిర్హమ్‌లు(ఒక కిలోకు పెచ్చువెండి) ఇచ్చి కొన్నట్లు ఉంది.[34]

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (ర) బనూ మగ్జూమ్ తెగవారికి బానిస. ఆయన, ఆయన తల్లిదండ్రులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే వారిపై ప్రళయమే విరుచుకుపడింది. అబూ జహల్ వీరిని హింసించడంలో ముందడుగుగా ఉండేవాడు. తీవ్రమైన ఎండలో ఈ బహుదైవారాధకులు వారిని రాళ్ళుదేలిన నేలపై పడుకోబెట్టి శిక్షించేవారు. ఓసారి వారిని ఈ విధంగా శిక్షించేటప్పుడు, దైవప్రవక్త(స) ఆ బాటన వెళ్ళడం తటస్థించింది. అది చూసి ఆయన, "ఓ యాసిర్ కుటుంబమా! సహనం వహించండి. మీ నివాస స్థలం స్వర్గమే" అంటూ ధైర్యం చెప్పారు. చివరికి యాసిర్(ర) ఆ బాధల్ని భరించలేక మరణించారు. ఇక అమ్మార్(ర) గారి మాతృమూర్తి హజ్రత్ సుమయ్యా మర్మాంగంలో అబూ జహల్ బరిశె దిగగొట్టి చంపేశాడు. ఈమె ఇస్లామ్ యొక్క మొట్టమొదటి 'మహిళా షహీద్' (అమరత్వం పొందిన స్త్రీ), హజ్రత్ అమ్మార్(ర)పై హింసా దౌర్జన్యాలు అలానే కొనసాగుతూపోయాయి. ఆయన్ను ఒక్కోసారి ఎండలో బాధిస్తే మరోసారి ఆయన వక్షస్థలంపై ఎర్రగా కాలిన బండరాయిని ఉంచడం జరిగేది. ఇంకొకసారి ఆయన్ను నీళ్ళల్లో ముంచి తీసేవారు. ఇలా చేస్తూ ఆ బహుదైవారాధకులు, "నీవు ముహమ్మద్‌ను తిట్టనంతవరకు లేదా మా ఆరాధ్య దైవాలైన లాత్, ఉజ్జాలను శ్లాఘించనంతవరకు నిన్ను విడిచి పెట్టేదేలేదని" బలవంతపెట్టేవారు. హజ్రత్ అమ్మార్(ర) మరో మార్గంలేక వారి మాటల్ని ఒప్పుకోవలసి వచ్చింది. ఆ తరువాత దైవప్రవక్త(స) సన్నిధికి రోదిస్తూ వచ్చి నా వల్ల తప్పు జరిగిందని విన్నవించుకున్నారు. దీనికి అల్లాహ్ ఈ దైవవాణిని

*34. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; తల్ఖీహ్ ఫహూమ్-పుట. 61.*

https://teluguislam.net



అవతరింపజేశాడు:

مَنْ كَفَرَ بِاللّٰهِ مِنْۢ بَعْدِ اِيْمَانِهٖۤ اِلَّا مَنْ اُكْرِهَ وَقَلْبُهٗ مُطْمَئِنٌّۢ بِالْاِيْمَانِ

**"ఎవరైనా విశ్వసించిన తరువాత బలవంతం చేయడం వలన అవిశ్వాసిగా మారిన పక్షంలో, అప్పుడు అతని హృదయం విశ్వాసం పట్ల తృప్తితో ఉంటే (అది వేరే విషయం). కాని ఎవరైనా హృదయపూర్వకంగా అవిశ్వాసానికి పాల్పడితే అతనిపై అల్లాహ్ ఆగ్రహం పడుతుంది."[35] (16 : 106)**

హజ్రత్ ఫకాహ్, అసలు పేరు అఫ్లహ్. ఈయన బనీ అబ్దుద్దార్ బానిస. ఆయన యజమానులు ఆయన్ను కాళ్ళకు తాళ్ళుగట్టి నేలపై ఈడ్చేవారు.[36]

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ ఖుజాఅ తెగకు చెందిన ఓ స్త్రీ ఉమ్మె అన్మార్‌కు బానిస. బహుదైవారాధకులు ఆయన్ను రకరకాలుగా హింసించేవారు. ఆయన తలవెంట్రుకల్ని పీకేవారు. గట్టిగా పట్టి మెడను మెలివేసేవారు. ఆయన్ను కణకణలాడే నిప్పురవ్వలపై పడుకోబెట్టి పైకి లేవకుండా బండరాళ్ళను ఉంచేవారు.[37]

జిన్నీరా,[38] నహ్దియా, ఆమె కుమార్తె ఉమ్మె అబీస్, వీరంతా స్త్రీ బానిసలు. వీరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. బహుదైవారాధకులు పెట్టే బాధలన్నింటిని భరించారు. ఆ బాధలు, హింసలు ఎలాగుండేవో ఇదివరకు చెప్పుకున్నాం. బనీ అద్దీ తెగకు చెందిన ఓ కుటుంబం 'బనీ మూమిల్' కు సంబంధించిన ఓ స్త్రీ బానిస ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే, హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్- అద్దీ తెగకు చెందినవారు. ఇంకా ముస్లిము కానప్పటి మాట- తాను అలసిపోయే అంతవరకు బాదేవారు. ఆ తరువాత, "నేను నిన్ను దయదలిచి వదిలిపెట్టలేదు, అలసిపోయి వదిలిపెట్టాను" అని చెప్పేవారు.[39]

---

*35. ఇబ్నె హష్షామ్-1/319,320; ఫిక్హుస్సీరత్ - ముహమ్మద్ గజాలి, పుట. 82.*

*36. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; ఏజాజుత్తన్‌జీల్, పుట. 53 ఆధారంగా.*

*37. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; తల్ఖీహ్ ఫహూమ్, పుట. 60.*

*38. మిస్కినాగా కూడా పిలిచేవారు.*

*39. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; ఇబ్నె హష్షామ్-1/319.*

https://teluguislam.net



చివరికి హజ్రత్ అబూ బక్ర్(ర), హజ్రత్ బిలాల్(ర) మరియు ఆమిర్ బిన్ ఫహీరాను కొని స్వతంత్రులుగా చేసినట్లే ఈ స్త్రీ బానిసల్ని కూడా కొని స్వతంత్రులుగా చేసేశారు.[40]

బహుదైవారాధకులు పెట్టే హింసల్లో ఓ హింస ఏమిటంటే, కొందరు సహాబాలను (ప్రవక్త(స)గారి అనుచరులను) అప్పుడే వలచిన ఒంటె లేదా ఆవు చర్మాల్లో చుట్టి ఎండలో పడవేసేవారు. కొందరిని ఇనుప కవచాలను తొడిగి కాలే బండరాయిపై పరుండబెట్టేవారు.[41] నిజానికి అల్లాహ్ మార్గంలో హింసలు, దౌర్జన్యాలకు గురి అయ్యేవారి జాబితా సుదీర్ఘమైనదీ, బాధాకరమైనదీను. పరిస్థితి ఎలాగుండేదంటే, ఎవరైనా ముస్లిముగా మారాడని తెలియగానే బహుదైవారాధకులు అతని పాలిట రాక్షసులుగా మారిపోయేవారు.

## దారె అర్ఖమ్ (అర్ఖమ్(ర) గారి గృహం)

ఈ హింసాదౌర్జన్యాల నుండి రక్షింపబడాలంటే, దైవప్రవక్త(స) ముస్లిములను మాటలచేత, చేతల రూపంగా, ఇస్లామ్ ధర్మం స్వీకరించారనే విషయం ఖురైష్‌కు తెలియకుండా ఉండేందుకు వారిని రహస్యంగా ఓ చోట చేరాలని ఆదేశించాల్సి ఉంటుంది. కారణం ఏమిటంటే, వారు బాహాటంగా ఓ చోట చేరితే బహుదైవారాధకులు ఆయన బోధించే బోధనలను, ఆత్మ ప్రక్షాళనను అడ్డుకునే ప్రమాదం ఉంది. ఫలితంగా ఉభయ వర్గాల్లో ఘర్షణ తలెత్తవచ్చు. ఇలాంటి పరిస్థితి దైవదౌత్యం వచ్చిన నాలుగవ సంవత్సరం కూడా ఎదురైంది. దాని వివరణ ఏమిటంటే, సహాబా(ర) కొండ లోయల్లో కూడి నమాజు చేసేవారు. దైవతిరస్కారులు కొంతమంది దీన్ని చూసి దుర్భాషలకు, దొమ్మీకీదిగారు. జవాబుగా హజ్రత్ సఅద్ బిన్ అబీవికాస్(ర) ఒక్కడిని రక్తం ప్రవహించేటట్లు కొట్టడం కూడా జరిగింది. ఇది ఇస్లామ్ చేత ప్రప్రథమంగా ప్రవహించిన రక్తం.[42]

ఒకవేళ ఇదే పరిస్థితి మాటిమాటికి తలెత్తి కొనసాగితే, ముస్లిములు అంతం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ సందేశ ప్రచారం రహస్యంగానే

40 ఇబ్నె హష్షామ్ -1/318, 319.

41. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/58.

42. ఇబ్నె హష్షామ్-1/263; ముక్తతుస్సీరత్ - ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 60.

https://teluguislam.net



జరగాలన్నది వివేకంతో కూడుకున్న పని. అందుకని, సహాబా(ర)లందరూ తమ శ్రేయం కోసం, తమ ఆరాధనలు, సందేశ ప్రచారం మరియు సామూహిక సమావేశాల కోసం రహస్యంగానే కలువవలసి ఉంటుంది. అయితే మహా ప్రవక్త(స) మాత్రం తమ సందేశ ప్రచారాన్ని, దానికి తోడు తమ ఆరాధనలను బహుదైవారాధకుల ఎదుట బాహాటంగా చేస్తూ ఉండేవారు. ఏ విషయం కూడా ఆయన్ను ఈ పని నుండి అడ్డుకోలేకపోయింది. అయినా ఆయన(స) కూడా ముస్లిములతో వారి సంరక్షణ దృష్ట్యా రహస్యంగానే సమావేశమయ్యేవారు. ఇటు అర్కమ్ అబిల్ అర్ఖమ్ మగ్జూమీ గృహం, సఫా కొండపై విద్రోహుల దృష్టి పడకుండా వారి సమావేశాలకు దూరంగా ఉండేది. అందుకని దైవప్రవక్త(స) దైవదౌత్యం లభించిన అయిదవ సంవత్సరం ఆ ఇంటినే తన సందేశ ప్రచారానికి, ముస్లిములతో సమావేశమవడానికి కేంద్రంగా చేసుకున్నారు.[43]

## అబీసీనియా వైపు మొదటి హిజ్రత్ (వలస)

హింసాదౌర్జన్యాల ఈ పరంపర దైవదౌత్యపు నాలుగవ సంవత్సరం మధ్య బాగంలో లేదా చివరి భాగంలో ఆరంభమైంది. ప్రారంభంలో ఇది మామూలుగా సాగింది. కాలం గడిచిన కొలదీ ఉధృతం కాసాగింది. చివరికి దైవదౌత్యపు అయిదవ సంవత్సర మధ్యభాగానికి చేరుకోగానే తారాస్థాయి నందుకుంది. ఇలా ముస్లిములు మక్కాలో నిలువలేకపోయారు. బహుదైవా రాధకుల ఆగడాల నుండి విముక్తి పొందేందుకు ఏదో ఒక మార్గాన్ని ఆలోచించడానికి వివశులైపోయారు. ఇలాంటి కఠినమైన అంధకార బంధురమైన పరిస్థితులలోనే కహఫ్ సూరా (అధ్యాయం) అవతరించింది. ఇది అసలు బహుదైవారాధకులు వేసిన ప్రశ్నలకు సమాధానం. కాని ఈ సూరాలో మూడు సంఘటనలు వివరించబడ్డాయి. వీటిలో అల్లాహ్ తరపు నుండి తన దాసుల భవిష్యత్తు గురించి సాంత్వన వచనాలు ఉన్నాయి. కాబట్టి అస్హాబె కహఫ్ (గుహవారు) సంఘటనలో, ధర్మానికి, విశ్వాసానికి ప్రమాదం ఏర్పడినప్పుడు దైవధిక్కార, దౌర్జన్య కేంద్రాల నుండి హిజ్రత్ (వలస) చేసి అల్లాహ్‌పై భారం వేస్తూ బయటకు వెళ్ళిపోవాలనే సంకేతం కూడా ఉంది.

---

43. ముక్తసరుస్సీరత్- ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 61

https://teluguislam.net



وَإِذِ اعْتَزَلْتُمُوهُمْ وَمَا يَعْبُدُونَ إِلَّا اللَّهَ فَأْوُوا إِلَى الْكَهْفِ يَنشُرْ لَكُمْ رَبُّكُم مِّن رَّحْمَتِهِ وَيُهَيِّئْ لَكُم مِّنْ أَمْرِكُم مِّرْفَقًا

"ఇప్పుడు మీరు వారితోను, అల్లాహ్‌నుకాదని వారు ఆరాధించే దేవుళ్ళ తోను సంబంధాలు త్రెంచుకున్నారు. కనుక, ఇక పదండి. ఫలానా గుహలో ప్రవేశించి ఆశ్రయం పొందండి. మీ ప్రభువు మీపై తన కారుణ్యఛాయను విస్తరింపజేస్తాడు, మీ కార్యసిద్ధికై సకల సామగ్రిని సమకూరుస్తాడు." (18: 16)

హజ్రత్ మూసా మరియు ఖిజర్ (అలైహిముస్సలాం)ల గురించి వివరిస్తూ, ఫలితాలు ఎల్లప్పుడూ బాహ్యపరిస్థితులకు అనుకూలంగా ఉండవు అని, అప్పుడప్పుడూ బాహ్యపరిస్థితులకు భిన్నంగా ఉంటాయని చెప్పడం జరిగింది. కాబట్టి ఈ సంఘటనలో, ముస్లిములకు వ్యతిరేకంగా ఏ హింసా దౌర్జన్యాలు జరుగుతున్నాయో వాటి ఫలితాలు కూడా పూర్తిగా భిన్నంగానే బయటబడతాయని, ఈ విద్రోహులు, దైవధిక్కారులు ఇప్పుడు విశ్వసించకపోతే మునుముందు వారే దాసోహం అంటూ ముస్లిముల ఎదుట తల ఒగ్గి వారి అదృష్టం తీర్పుకు ప్రాధేయపడతారు అని భవిష్యవాణి చెప్పడం జరిగింది.

జుల్‌ఖర్‌నైన్ గురించి అవతరించిన వాక్యాల్లో కొన్ని ప్రత్యేక విషయాల వైపునకు దృష్టిని మరల్చబడం జరిగింది.

1. ఈ భూమండలం అల్లాహ్‌దే. ఆయన తన దాసుల్లో తాను కోరిన వ్యక్తిని దాని వారసునిగా చేస్తాడు.
2. ఈ సాఫల్యం, విజయం విశ్వాసమార్గంపై నడవడం వల్లనే సిద్ధిస్తుంది. దైవధిక్కార ధోరణి వల్ల కాదు.
3. అల్లాహ్ అప్పుడప్పుడు ఆయా కాలాలకు చెందిన యాజూజ్ మాజూజ్‌ల నుండి రక్షించడానికి తన దాసుల నుండి కొందరిని ఎంపిక చేసి నిలబెడతాడు.
4. అల్లాహ్‌కు భయపడే సద్వర్తనులే భూమండల వారసత్వానికి ఎక్కువ హక్కుదారులు.

కహఫ్ సూరా తరువాత జుమర్ సూరా అవతరణ ఆరంభమైంది. అందు హిజ్రత్ (వలస) వైపునకు సంకేతం ఉంది. అందులో అల్లాహ్ సృష్టించిన ఈ

https://teluguislam.net



లోకం ఇరుకైనది ఎంతమాత్రం కాదని చెప్పడం జరిగింది.

لِلَّذِيْنَ اَحْسَنُوْا فِيْ هٰذِهِ الدُّنْيَا حَسَنَةٌ ؕ وَاَرْضُ اللّٰهِ
وَاسِعَةٌ ؕ اِنَّمَا يُوَفَّى الصّٰبِرُوْنَ اَجْرَهُمْ بِغَيْرِ حِسَابٍ ۝۱۰

"(ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు, విశ్వసించిన నా దాసులారా! మీ ప్రభువునకు భయపడండి. ఈ లోకంలో సద్వర్తనను అవలంబించే వారికి మేలు జరుగుతుంది. దేవుని భూమి విశాలమైనటువంటిది. ఓర్పు వహించే వారికి లెక్క లేనంత ప్రతిఫలం ఇవ్వబడుతుంది." (39 : 10)

'అస్మహ్' నజాషీ అబీసీనియాకు చెందిన న్యాయవంతుడైన పరిపాలకుడనే విషయం దైవప్రవక్త(స)కు తెలుసు. అక్కడ ఎవ్వరిపైనా దౌర్జన్యం జరగదు. అందుకని ఆయన(స), ఉపద్రవాల నుండి తమ ధర్మాన్ని రక్షించుకునేందుకు అబీసీనియాకు వలస పోవాలని ముస్లిములకు ఆదేశమిచ్చారు. ఆ తరువాత అనుకున్న విధంగా రజబ్ నెల, దైవదౌత్య శకం అయిదవ సంవత్సరం సహాబా(ర)కు చెందిన మొదటి జట్టు అబీసీనియా వైపునకు బయలుదేరింది. ఈ జట్టులో పన్నెండుగురు మగవారు, నలుగురు స్త్రీలు ఉన్నారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర) దానికి నాయకులు. ఆయన వెంట దైవప్రవక్త(స)గారి కుమార్తె హజ్రత్ రుఖయ్యా(ర) కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) ఆమె గురించి చెబుతూ, "హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మరియు లూత్(అ.స.) తరువాత అల్లాహ్ మార్గంలో హిజ్రత్ చేసిన ప్రథమ కుటుంబం అది" అని సెలవిచ్చారు.[44]

ఈ జట్టు రాత్రి అంధకారంలో తమ క్రొత్త గమ్యానికి బయలుదేరింది. గోప్యంగా ఉండవలసిన విషయం గనక ప్రయాణం గురించి ఖురైషుకు తెలియకూడదనే జాగ్రత్త తీసుకోబడింది. ఎర్ర సముద్రం ఓడరేవు 'షుఅయిబా' వైపునకు పయనమైందీ జట్టు. అదృష్టవశాత్తు అక్కడ రెండు పడవలు ఉన్నాయి. అవి ఈ జట్టును ఎక్కించుకొని సముద్రానికి ఆవలి ఒడ్డున ఉన్న అబీసీనియా వైపునకు వెళ్ళిపోయాయి. ఖురైషుకు ఈ విషయం చూచాయగా తెలిసింది. వారు

44. ముఖ్తరుస్సీరత్- షేక్ అబ్దుల్లా, పుట. 92, 93; జాదుల్ మఆద్-1/24, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.

https://teluguislam.net



దాన్ని వెంటాడి తీరం వరకు వెళ్ళగలిగారు కాని అప్పటికి సహాబా వెళ్ళిపోవడం వలన వెనక్కు తిరిగివచ్చేశారు. అటు ముస్లిములు అబీసీనియా చేరి ఊపిరి పీల్చుకున్నారు.[45] కాని రమజాన్ నెలలో ఓ సంఘటన జరిగింది. దైవప్రవక్త(స) ఓసారి కాబా మసీదుకు వెళ్ళారు. అక్కడ ఖురైష్‌ల గుంపు ఒకటి సమావేశమై ఉంది. వారిలో పెద్ద పెద్ద సర్దారులు కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) హఠాత్తుగా నిలబడి నజ్మ్ సూరా పఠనాన్ని ప్రారంభించారు. ఆ దైవధిక్కారులు ఇది వరకు ఖుర్‌ఆన్ పఠనం వినలేదు. వారి వైఖరే అది. దివ్యఖుర్‌ఆన్‌లో వారి ఈ వైఖరి గురించి ఇలా చెప్పడం జరిగింది. ఈ సత్యతిరస్కారులు ఇలా అంటారు;

لَا تَسْمَعُوا لِهَٰذَا الْقُرْآنِ وَالْغَوْا فِيهِ لَعَلَّكُمْ تَغْلِبُونَ ﴿٢٦﴾

**"ఈ ఖుర్‌ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడేటప్పుడు వినకుండా విఘ్నం కలిగించండి. బహుశా ఇలాగైనా మీరు ప్రాబల్యం వహించవచ్చు."**

అయితే దైవప్రవక్త(స) హఠాత్తుగా నజ్మ్ సూరా పఠనాన్ని ప్రారంభించి నప్పుడు, వారి చెవుల్లో అమృతం గ్రోలినట్లు తోచింది. దాని ఔన్నత్యాన్ని అనుభ వించినప్పుడూ ఎవ్వరికీ తమ ధ్యాసే లేదు. ఎవరి మనస్సులోను ఎటువంటి చెడు ఉద్దేశ్యం జనించలేదు. చివరికి దైవప్రవక్త(స) సూరా చివరన హృద యాలను ప్రకంపించే ఆయత్‌ను పఠిస్తూ, فَاسْجُدُوا لِلَّهِ وَاعْبُدُوا ۩ **"అల్లాహ్ ముందు మోకరిల్లండి (సజ్దా చేయండి). ఆయనకు దాస్యం చేయండి"** అనే దైవాదేశాన్ని వినిపిస్తూ సజ్దా చేయగా ఏ ఒక్కడూ తన ఆధీనంలోలేక 'సజ్దా' చేశారు(సాష్టాంగబడ్డారు). నిజం చెప్పాలంటే, ఈ పరిస్థితి, గర్విష్టులైన ఖురైషుల మొండితనాన్ని పటా పంచలు చేసేసింది. వారు తమ ఆధీనంలో లేక అందరూ సజ్దాలో పడి పోయారు.[46]

కాని ఆ తరువాత దైవగ్రంథ పఠనం ఔన్నత్యం వారి గర్వం అణచివేసిం దని, దేన్నయితే అంతమొందించడానికి వారు కంకణబద్ధులై ఉన్నారో దాని కోసం ఎలాంటి ప్రయత్నాలు చేశారో అదంతా బూడిదలో పోసిన పన్నీరు చందాన వృథా అయిందని తెలియగానే నాలుక కరుచుకున్నారు. ఈ సంఘ

---

*45. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.*

*46. సహీ బుఖారీలో ఈ సజ్దా సంఘటనను ఇబ్నె మస్ఊద్, ఇబ్నె అబ్బాస్ (ర) ఉల్లేఖించారు.*

https://teluguislam.net



టన జరిగాక అన్నివైపుల నుండి వారిపై నిందల పరంపర వచ్చిపడ నారంభించింది. దీని నుండి తప్పుకోవడానికి సాకులు వెదుకనారంభించారు. చేసేదిలేక దైవప్రవక్త(స)పై అపనింద మోపుతూ, ఆయన వారి విగ్రహాలను గౌరవిస్తూ, "వీరు మహోన్నతమైన దేవతలు, వీరు మనకు సిఫార్సు చేస్తారు"అని చెప్పారని బొంకారు.

ఇది పూర్తిగా అసత్య ప్రచారం. దీన్ని వారు అవలంబించింది, దైవ ప్రవక్త(స) సజ్దా చేసినప్పుడు తాము కూడా సజ్దా చేశామన్న నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికే. దైవప్రవక్త(స) గురించి సతతం అసత్యప్రచారం చేసే వీరు, తమను రక్షించుకోవడానికి ఇలాంటి అసత్య మాటల్ని చెప్పడానికి వెనకాడగలరా?[47]

మొత్తానికి బహుదైవారాధకులు సజ్దా చేసిన ఈ సంఘటన వార్త అబీసీనియాకు కూడా చేరింది. వలస వెళ్ళిన ముహాజిర్లు కూడా ఇది విన్నారు. అయితే వీరు విన్నది అసలు యదార్థానికి భిన్నమైన విషయం. అంటే, ఖురైష్ లంతా ముస్లిములైపోయారు అన్నదే ఆ విషయం. అందుకని వారు షవ్వాల్ నెలలో మక్కాకు బయలుదేరారు. మక్కా నగరం ఇక ఒక రోజు ప్రయాణ దూరంలో ఉందనగా అసలు విషయం వారికి తెలిసిపోయింది. ఆ తరువాత కొందరు అటునుంచే తిరిగి అబీసీనియాకు వెళ్ళిపోయారు. కొందరు రహస్యంగా లేదా ఖురైష్‌కు చెందిన ఎవరో ఒకరి రక్షణలో మక్కా నగరంలో ప్రవేశించారు.[48]

## అబీసీనియాకు రెండో హిజ్రత్

ఆ తరువాత వలస నుండి తిరిగివచ్చిన ముహాజిర్లపై ప్రత్యేకంగాను, ఇతర ముస్లిములపై సాధారణంగాను హింసాదౌర్జన్యాలు బాగా పెరిగిపోయాయి. వారి కుటుంబ సభ్యులు వారిని మరీ ఆగడాలకు గురి చేశారు. 'నజాషీ' (అబీసీనియా చక్రవర్తి) వారి ఎడల అవలంబించిన ఉదార వైఖరి వారిని మరింత రెచ్చగొట్టింది. విధిలేక దైవప్రవక్త(స) తన అనుచరుల్ని (సహాబాలను) తిరిగి హిజ్రత్ చేయమని సలహా ఇచ్చారు. అయితే, రెండవసారి చేసిన హిజ్రత్, మొదటి హిజ్రత్ కంటే అనేక కష్టాలను కొనివచ్చింది. ఈసారి ఖురైష్ వారి ప్రయత్నాన్ని వమ్ముచేయడానికే సంసిద్ధులై ఉన్నారు గనుక ఎంతో

*47. పరిశోధకులు ఈ ఉల్లేఖనాన్ని బాగా అధ్యయనం చేసి ఈ నిర్ణయానికే వచ్చారు.*
*48. జాదుల్ ముఆద్-1/24; 2/44; ఇబ్నె హష్షామ్-1/61.*

https://teluguislam.net



జాగరూకతతో మెలగవలసిన పరిస్థితి ఏర్పడింది. కాని ముస్లిములు ఖురైష్ కంటే చురుకుగా ప్రవర్తించారు. అల్లాహ్ వారి ఈ ప్రయాణాన్ని సులభతరమూ చేశాడు. వారు ఖురైష్‌కు పట్టుబడకముందే అబీసీనియా రాజు వద్దకు చేరుకోగలిగారు.

ఈసారి వారి సంఖ్య మొత్తం 82 లేదా 83 మంది పురుషులు (అమ్మార్ గారి హిజ్రత్ దీనికి భిన్నమైనది), 18 లేక 19 మంది స్త్రీలు [49] అల్లామా మన్సూర్ పూరి అయితే స్త్రీలు ఖచ్చితంగా పద్దెనిమిది మందే అని అంటారు.[50]

## అబీసీనియా ముహాజిర్లకు వ్యతిరేకంగా ఖురైష్ కుట్ర

ముస్లిములు తమ విశ్వాసాన్ని, ప్రాణాలను కాపాడుకుంటూ ఓ ప్రశాంత ప్రదేశానికి పారిపోయారన్న అక్కసు ఖురైష్‌ను వెంటాడుతూనే ఉంది. వారు, వారిలో గొప్ప తెలివిగల ఇద్దరు వ్యక్తులు, అమ్రూ బిన్ ఆస్ మరియు అబ్దుల్లా బిన్ రబీలను (అప్పటికి వారింకా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు) ఎంపిక చేసి, నజాషీ మరియు క్రైస్తవ పాదరీల నాయకులకు సమర్పించుకోవడానికిగాను కానుకలిచ్చి తమ దూతలుగా పంపించడం జరిగింది. వీరిద్దరూ అబీసీనియాకు వెళ్ళి మొదట క్రైస్తవ పాదరీల నాయకులకు కానుకలిచ్చి ముస్లిములను అబీసీనియా నుండి వెళ్ళగొట్టడానికి తగు కారణాలను చూపెడుతూ మచ్చిక చేసుకున్నారు. క్రైస్తవ పాదరీ నాయకులు, నజాషీకి నచ్చజెప్పి ముస్లిములను వెనక్కు పంపిస్తామనే మాట ఇచ్చిన తరువాత ఈ ఇద్దరు దౌత్యప్రతినిధులు నజాషీ దర్బారుకు హాజరయ్యారు. అతనికి కానుకలను సమర్పిస్తూ తమ మనోగతాన్ని ఇలా బయటబెట్టారు.

"ఓ రాజా! మీ దేశంలోనికి మాకు చెందిన కొందరు అవివేకులైన యువకులు పారిపోయివచ్చారు. వారు వారి జాతిధర్మాన్ని విడిచిపెట్టేశారు. అయితే ఇటు మీ ధరాన్నీ విశ్వసించలేదు, సరికదా. ఓ క్రొత్త ధర్మాన్ని సృష్టించారు. ఆ ధర్మాన్ని మీరుగాని, మేముగాని ఎరుగము. వారి తల్లిదండ్రులు, పినతండ్రులు, కుటుంబ సభ్యులు మమ్మల్ని మీ వద్దకు పంపించారు. ఎందుకంటే, వారి బాగోగుల గురించి వారే బాగా ఎరిగిన వారు గనుక. కాబట్టి ఈ యువకుల్ని మా వెంట మా దేశానికి పంపించమని మనవి చేస్తున్నాం" అని ప్రాధేయపడ్డారు.

---

*49. జాదుల్ ముఆద్-1/24; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.*

*50. జాదుల్ ముఆద్-1/24; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.*

https://teluguislam.net



వారిద్దరు కలసి వారి మనోగతాన్ని బయటబెట్టిన తరువాత క్రైస్తవ మత గురువులు అందుకొని, "మహారాజా! వీరిద్దరు చెప్పిందే సబబు. తమరు ఆ యువకుల్ని వారికి అప్పగించండి. వీరు వారిని వారి జాతికి అప్పజెబుతారు" అని వంతపాడారు.

అయితే నజాషీ, ఈ విషయాన్ని బాగా ఆకళింపుజేసుకోవడానికి, అసలు విషయాన్ని తెలుసుకోవడానికిగాను మరింత లోతులోనికి వెళ్ళడం అవసరం అనుకొని ఆ ముస్లిమ్ యువకుల్ని హాజరుకమ్మని ఆదేశించాడు. ముస్లిములు ఫలితం ఎలాగున్నా సరే, తాము పూర్తి యదార్థమైన విషయాన్నే తెలపాలన్న సంకల్పంతో రాజు సన్నిధికి హాజరయ్యారు. ముస్లిములు దర్బారులోనికి వచ్చి నిలబడిన తరువాత నజాషీ వారిని ఉద్దేశించి;

"మీరు మీ జాతి నుండి వేరుబడడానికి ఆధారభూతమైన ఆ క్రొత్త ధర్మం ఏమిటి? నేను విశ్వసించే ధర్మాన్ని కూడా మీరు అవలంబించలేదు. మరే మతాల్లో దేన్నయినా విశ్వసించడం లేదు. దానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

ముస్లిముల వైపు నుండి హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ ముందుకొచ్చి, "ఓ రాజా! అజ్ఞానంలో కొట్టుమిట్టాడే జాతి మాది. ఇదివరకు మేము విగ్రహాల్ని పూజించేవారం. చనిపోయిన జంతువుల మాంసాన్ని భుజించేవారము. వ్యభిచారానికి పాల్పడేవారం. బంధువులతో సంబంధాల్ని త్రెంచుకునేవారం. పొరుగువారి ఎడల దురుసుగా ప్రవర్తించేవారం. మాలోని శక్తివంతుడు బలహీనుణ్ణి అణచివేసేవాడు. మేము ఈ పరిస్థితిలో ఉండగా అల్లాహ్ మా జాతి నుండే ఓ ప్రవక్తను పంపాడు. ఆయన వంశం ఉన్నతమైనది. ఆయన సత్యసంధత, అమానతులను రక్షించడం, పవిత్రతను మేము మొదటి నుండే ఎరిగి ఉన్నవాళ్ళం. ఆయన మమ్మల్ని అల్లాహ్ మార్గం వైపునకు పిలిచాడు. మేము ఒకే దేవుణ్ణి విశ్వసించాలనీ, ఆయన్నే ఆరాధించాలనీ, ఆయన తప్ప ఏ రాయిరప్పలను విగ్రహాలను మేమూ, మా తాతముత్తాతలు పూజిస్తూ వచ్చామో వాటిని విసర్జించాలని బోధించారు. సతతం సత్యం పలకడం, అమానతులను (అప్పగింతలను) అప్పజెప్పడం, సంబంధాలను పెంపొందించుకోవడం, పొరుగువారితో సద్వర్తనగా మెలగడాన్ని ప్రేరేపిస్తూ, వ్యభిచారం, రక్తపాతాన్ని వదిలేయమని ఆదేశించారు. దుష్కార్యాల్లో చిక్కుకోవడం, అసత్యం పలకడం,

https://teluguislam.net



అనాథల ఆస్తుల్ని కాజేయడం మరియు శీలవతులైన మహిళలపై అపనిందలు వేయడం లాంటి కార్యాల నుండి మమ్మల్ని వారించారు. ఆయన మమ్మల్ని ఒకే అల్లాహ్‌ను ఆరాధించమనీ, ఆయనకు సాటి కల్పించవద్దనీ, ఆదేశించారు. నమాజు చేయమనీ, రోజా వ్రతాన్ని పాటించమనీ, జకాత్ చెల్లించమనీ ఆజ్ఞాపించారు."

హజ్రత్ జాఫర్ (ర) అలానే ఇస్లామ్ సుగుణాలను ఏకరువు పెడుతూ, "మేము ఆ ప్రవక్తను సత్యప్రవక్తగా నమ్మాము, ఆయన్ను విశ్వసించాము. ఆయన తెచ్చిన దైవధర్మం ప్రకారం నడుచుకుంటున్నాము. ఏయే విషయాలను ప్రవక్త(స) హరాం(నిషిద్ధం) చేశారో వాటిని హరాంగానూ, మరే వస్తువుల్ని హలాల్(ధర్మసమ్మతం) చేశారో వాటిని మేము ధర్మసమ్మతమైనవిగానూ తలచాము. దీనికి మా జాతి మా ఎడల ఉగ్రరూపం దాల్చింది. అది మాపై దౌర్జన్యాలు చేసి హింసించింది. మమ్మల్ని మా ధర్మం నుండి తప్పించడానికి పన్నాగాలు పన్నింది, మమ్మల్ని శిక్షించింది. మా జాతి మమ్మల్ని అల్లాహ్ ఆరాధన చేయకుండా తిరిగి విగ్రహారాధన వైపు మరిలేందుకు; ఏ అశుద్ధ పదార్థాలను వారు ధర్మసమ్మతం చేసుకున్నారో తిరిగి మేము వాటిని ధర్మసమ్మతమైనవిగా భావించాలని ఒత్తిడి తెచ్చింది. వీరిలా మాపై చేస్తున్న అగడాలను, హింసాదౌర్జన్యాలను అధికం చేసిన తరువాత, మాకు నిలువనీడ లేకుండా చేసినప్పుడు, మా నడుమ, మా ధర్మం నడుమ అడ్డంగా వచ్చి నిలబడినప్పుడు మేము తమ దేశానికి వలస రావలసివచ్చింది. ఇతరులకంటే మిమ్మల్నే నమ్మి మీ రక్షణలో ఉండడానికి సంసిద్ధులమై వచ్చాము. ఓ రాజా! మీ వద్ద ఉన్నంత వరకు మాపై ఎలాంటి జులుం జరగదని మేమాశిస్తున్నాం" అని విన్నవించుకున్నారు. దానికి నజాషి,"మీ ప్రవక్త తెచ్చిన ధర్మంలోనిది ఏదైనా మీ దగ్గర ఉందా?" అని ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ జాఫర్(ర), "ఉంది!" అని బదులు పలికారు.

నజాషి, "అదేమిటో చదివి వినిపించు" అని ఆదేశించగా, హజ్రత్ జాఫర్(ర), మరియమ్ సూరాలోని మొదటి ఆయత్‌లను పఠించి వినిపించారు. ఈ పఠనాన్ని వినగానే నజాషీ, క్రైస్తవ మతగురువులు బాగా రోదించారు. కన్నీటితో వారి గెడ్డాలు తడిసిపోయాయి.

ఆ తరువాత నజాషీ, "ఈ గ్రంథం మరియు ఈసా(అ.స.) ( ఏసుక్రీస్తు)

https://teluguislam.net



తెచ్చిన గ్రంథం ఒకే దివ్వె నుండి వెలిసిన వెలుగులు" అంటూ అమ్రూ బిన్ ఆస్ మరియు అబ్దుల్లా బిన్ రబీయాను ఉద్దేశించి,"మీరిద్దరు ఇక్కడి నుండి వెళ్ళి పోండి. నేను వీరిని మీకు అప్పగించేది లేదు. వీరికి వ్యతిరేకంగా ఏ ఎత్తుగడా ఇక్కడ పనికిరాదు" అని చెప్పాడు.

ఈ రాజాదేశం వెలువడ్డాక వారిరువురు దర్బారు నుండి బయటకు వచ్చారు. అయితే అమ్రూ బిన్ ఆస్, మాత్రం అబ్దుల్లా బిన్ రబీనుద్దేశించి, "దైవసాక్షి! రేపు చూద్దువుగాని. వారి గురించి నేనే ఎత్తుగడ పన్నుతానో! వారు కూకటివ్రేళ్ళతో పెకిలించబడతారు" అని అన్నాడు. దానికి అబ్దుల్లా బిన్ రబీయా, " పోనిద్దువూ! వారు మాకు వ్యతిరేకంగా చెప్పినప్పటికీ మస కుటుంబానికి, తెగకు చెందినవారే కదా" అని నచ్చజెప్ప ప్రయత్నం చేశాడు. కాని అమ్రూ బిన్ ఆస్ మాత్రం ఆయన మాటల్ని పట్టించుకోలేదు.

మరుసటి రోజు అమ్రూ బిన్ ఆస్, నజాషీ దర్బారుకు వెళ్ళి,"ఓ రాజా! వీరు మరియమ్ కుమారుడు హజ్రత్ ఈసా(అ.స.)(ఏసు) పై ఓ తీవ్రమైన నిందను వేస్తున్నారు" అని చెప్పాడు. దీనికి నజాషీ తిరిగి ముస్లిములను దర్బారుకు రప్పించాడు. ముస్లిములు హజ్రత్ ఈసా(అ.స.) గురించి చేస్తున్న ఆ తీవ్రమైన వ్యాఖ్యలు ఏమిటో తెలుసుకునే ఉద్దేశ్యంతో, ఈసారి ముస్లి ములు కొంత తడబడ్డారు. అయితే వారు, ఏది చెప్పినా నిజాన్నే చెబుతామని, దాని పరిణామం ఏమైనాసరే అని నిర్ణయించుకొని దర్బారులో హాజరయ్యారు. నజాషీ వారినుద్దేశించి ఆ విషయాన్నే ప్రస్తావించాడు.

హజ్రత్ జాఫర్(ర), "మేము హజ్రత్ ఈసా (అ.స.) గురించి మా ప్రవక్తశ్రీ చెప్పిందే చెబుతున్నాం. అంటే ఆయన (ఈసా - అ.స.) అల్లాహ్ ప్రవక్త అని, ఆయన ఆత్మ అని, కన్య అయిన పవిత్ర మరియమ్ (అ.స.) గర్భాన జన్మించినవాడని" చెప్పారు.

దీనికి నజాషీ భూమ్మీద నుండి ఓ గడ్డిపోచ పైకెత్తి,"దైవసాక్షి! మీరు చెప్పింది యదార్థం. హజ్రత్ ఈసా(అ.స.) ఈ గడ్డిపోచకంటే మెరుగైన వాడు కారు" అని అనగా అక్కడున్న క్రైస్తవ మతగురువుల నోటి నుండి ఆశ్చర్యాన్ని వెలిబుచ్చినట్లుగా "ఆ, అదేమిటీ!" అనే పలుకులు వెలువడ్డాయి.

నజాషీ వారి ఈ హూంకరింపును విని,"మీరు హూంకరించినా సరే, (ఇది యదార్థం)" అని పలికాడు.

ఆ తరువాత నజాషీ, ముస్లిములను ఉద్దేశించి,"వెళ్ళండి, నా

https://teluguislam.net



రాజ్యంలో ప్రశాంతంగా బ్రతకండి. మీ ఎడల దుర్భాషలాడేవానికి జరిమానా విధించబడుతుంది. మిమ్మల్ని బాధించడం వల్ల నాకు బంగారు కొండ లభించినా సరే, దాన్ని నేను సహించేదిలేదు" అన్నాడు.

ఆ తరువాత తన దర్బారులోని వారినుద్దేశించి,"వీరిద్దరు తెచ్చిన కానుకలను వారి ముఖాన పడవేయండి. దైవసాక్షి! అల్లాహ్ నాకు నా రాజ్యాన్ని తిరిగి ప్రసాదించేటప్పుడు ఎలాంటి లంచం పుచ్చుకోలేదు, నేనెలా ఈ లంచాన్ని స్వీకరించగలను? దానికితోడు అల్లాహ్ నా విషయంలో ఎవరి మాటనూ వినలేదు. నెనెలా ఇతరుల మాటలను వినగలను?" అని చెప్పి సభను చాలించాడు.

ఈ సంఘటనను గురించి వివరించిన హజ్రత్ ఉమ్మె సల్మా (ర) ఇలా అంటారు.

"ఆ తరువాత వారిద్దరు తాము తెచ్చిన కానుకలను తమ చేతపట్టుకొని బిడియపడుతూ వెనక్కు తిరిగారు. మేము నజాషీ దగ్గర ఓ మంచి దేశంలో ఓ మంచి పొరుగువాని పంచన ఉండిపోయాము."[51]

ఇది ఇబ్నె ఇస్హాక్ (ర)గారి కథనం. ఇతర సీరత్ చరిత్రకారుల కథనం ప్రకారం, నజాషీ దర్బారులో హజ్రత్ అమ్రూ బిన్ ఆస్, బద్ర్ యుద్ధం తరువాత గాని వెళ్ళారు. కొందరి పరిశోధన ప్రకారం, హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర) నజాషీ దర్బారులో ముస్లిములను వెనక్కు తోడ్కొని రావడానికి రెండు మార్లు వెళ్ళారు. అయితే బద్ర్ యుద్ధం తరువాత హజ్రత్ జాఫర్ (ర) మరియు నజాషీల నడుమ జరిగిన ప్రశ్నోత్తరాల వివరాలేవైతే చెప్పబడ్డాయో అవి దాదాపు ఇబ్నె ఇస్హాక్ చెప్పిన అబీసీనియా వలస సందర్భంలో జరిగిన ప్రశ్నోత్తరాల వివరాల్లాంటివే.

అయితే, ఈ ప్రశ్నల సారాంశాన్ని బట్టి తెలిసిందేమిటంటే, ఈ వ్యాజ్యం నజాషీ దర్బారులో మొదటిసారే ప్రవేశపెట్టడం జరిగింది అన్నదే. అందుకని, ముస్లిములను వెనక్కు తీసుకురావడానికి జరిగిన ప్రయత్నం ఒక్కసారే జరిగిందని, అది కూడా అబీసీనియా వలస తరువాత జరిగిన ప్రయత్నం అని గట్టిగా చెప్పగలం.

ఏదిఏమైనా బహుదైవారాధకుల ఈ కుట్ర, కుతంత్రాలు విఫలం అయి

---

51. ఇబ్నె హష్షామ్-1/334-338.

https://teluguislam.net



పోయాయి. తమ విద్వేషవైషమ్యాలను బహిర్గతం చేసుకోడానికి, తమ అక్కసును కేవలం తమ అధికార పరిధిలోనే వెళ్ళగక్కడం తప్ప మరే గత్యం తరంలేదనే విషయం వారికి తెలిసిపోయింది. దీని కోసం వారు ఓ భయంకర మైన ప్రణాళిక గురించి ఆలోచించనారంభించారు. నిజానికి, ఈ ఉపద్రవాన్ని అడ్డుకోడానికి వారి ముందు రెండే రెండు మార్గాలున్నాయన్న విషయం బాగా అర్థమైపోయింది. ఒకటి, తమ శక్తినుపయోగించి దైవప్రవక్త (స)ను దైవసందేశ ప్రచారం చేయకుండా అడ్డుకోవడం. రెండు, ఆయన్ను తుదముట్టించడం. అయితే రెండో మార్గం అతి కష్టంతో కూడుకున్న మార్గం. ఎందుకంటే, అబూ తాలిబ్ దైవప్రవక్త (స) రక్షకులుగా ఉంటూ, బహుదైవారాధకుల ముందు పటిష్టమైన ఇనుప గోడలా నిలబడి ఉండడం. అందుకని అబూ తాలిబ్‌తో ముఖాముఖిగా వ్యవహారాన్ని తేల్చుకోవడమే మంచిదని గ్రహించారు వారు.

## అబూ తాలిబ్‌కు ఖురైష్ బెదిరింపు

ఈ ప్రతిపాదన ప్రకారం, ఖురైష్ సర్దారులు అబూ తాలిబ్ వద్దకు వెళ్ళారు. అబూ తాలిబ్ నుద్దేశించి, "అబూ తాలిబ్! మీరు వయస్సు రీత్యా, గౌరవ మర్యాదల రీత్యా మాలో పెద్దవారు. మేము ఇదివరకే మీ సోదర కుమారుణ్ణి అడ్డుకోమని చెప్పాం. కాని మీరు అలా చేయలేదు. మా తాత ముత్తాతల్ని తూలనాడడం, మా బుద్ధివివేకాల్లో లోపాలు ఎంచడం, మా ఆరాధ్య దైవాలను కించపరచడం మేము ఇక భరించలేం. మీరే గనక ఆయన్ను అడ్డుకోకపోతే మీతో, ఆయనతో యుద్ధానికి దిగవలసివస్తుంది. అందు ఎవరో ఒకరు తుడుచుకుపోక తప్పదు" అని చెబుతూ బెదిరించారు.

అబూ తాలిబ్‌పై ఖురైష్‌ల ఈ బెదిరింపు బాగా ప్రభావం చూపింది.

ఆయన ప్రవక్తశ్రీని పిలిపించి, "సోదర కుమారా! నీ జాతి నాయకులు నా వద్దకు వచ్చి ఇలా ఇలా అన్నారు. ఇక నీవు నా గురించి, నీ గురించి ఆలోచించు. నేను మొయ్యలేని భారాన్ని నాపై మోపకు" అని నచ్చజెప్పారు.

ఇది విన్న దైవప్రవక్త (స), పినతండ్రి కూడా తమను వదిలేసేటట్లున్నాడు, ఆయన పట్టు బలహీనం అవుతున్నదని గ్రహించి ఇలా సెలవిచ్చారు:

"బాబాయి! దైవసాక్షి! వీరు నా కుడి చేతిలో సూర్యుణ్ణి, ఎడమ చేతిలో చంద్రుణ్ణి తెచ్చి ఉంచినా, నేనీ కార్యాన్ని దాని హద్దు వరకు తీసుకొని వెళ్ళకుండా

https://teluguislam.net



ఆగలేను. అల్లాహ్ తన శిక్షనైనా అవతరింపజెయ్యాలి లేదా ఈ మార్గంలో నేనైనా నామరూపాల్లేకుండా పోవాలి. అప్పటి వరకు ఈ సందేశ ప్రచారాన్ని ఆపేది లేదు" అని నిక్కచ్చిగా చెప్పారు.

ఆ తరువాత ప్రవక్తశ్రీ కళ్ళు కన్నీటిమయమయ్యాయి. రోదిస్తూ అక్కడి నుండి లేచి వెళ్ళిపోబోగా అబూ తాలిబ్ ఆయన్ను కేకవేసి పిలిచారు. ప్రవక్తశ్రీ ఎదురుకు రాగానే,

"కుమారా! నీకిష్టమైనట్లు ప్రచారం చెయ్యి. దైవసాక్షి! నేను నిన్ను ఎప్పుడూ ఏ కారణం చేత కూడా విడిచిపెట్టేది లేదు"[52] అంటూ ఈ క్రింది పద్యపంక్తుల్ని వల్లించారు.

అర్థం: "దైవసాక్షి! వారు తమ మందీమార్బలంతో నీ వద్దకు రానైనా రాలేరు. నేను చనిపోయి ఖననం అయిపోతే తప్ప. నీవు నీ మనోభీష్టాన్ని విడమర్చి చెప్పు. నీకెలాంటి ఆటంకమూ ఉండదు. సంబరపడు, నీ కళ్ళు చల్లపడతాయి."[53]

## ఖురైష్ బృందం మరోసారి అబూ తాలిబ్ వద్దకు

గతంలో చేసిన బెదిరింపుకు ఎలాంటి సమాధానమూ లభించలేదు. పైగా ప్రవక్తశ్రీ తన పనిని చేసుకుంటూనేపోతున్నారు. అప్పుడు ఖురైష్‌కు అర్థమైపోయింది, అబూ తాలిబ్ ప్రవక్తశ్రీని వదలలేరన్న సంగతి. పైగా ఆయన ఖురైష్ నుండి వేరుబడి వారి శత్రుత్వాన్ని కూడా కొనితెచ్చుకోడానికైనా సిద్ధంగా ఉన్నారన్న విషయం తేలిపోయింది. కాబట్టి ఖురైష్ వలీద్ బిన్ ముగైరా కుమారుణ్ణి వెంటబెట్టుకొని అబూ తాలిబ్ దగ్గరకు వచ్చారు. ఆయననుద్దేశించి:

"ఓ అబూ తాలిబ్! ఇతను ఖురైష్‌కు చెందిన నవయవ్వనంలోవున్న అందమైన యువకుడు. ఇతని సహాయానికీ, ఇతని సంపాదనకూ మీరే హక్కుదారులు కాగలరు. ఇతన్ని మీరు మీ పుత్రునిగా స్వీకరించండి. ఇతను మీవాడే అయిపోతాడు. ఇతనికి బదులుగా మీరు మీ సోదరుని కుమారుణ్ణి మాకు అప్పగించండి. అతను మా తాతముత్తాతల ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నాడు.

---

52. ఇబ్నె హిషామ్-1/265, 266.
53. ముఖ్తరుస్సీరత్- షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట.68.

https://teluguislam.net



మా జాతిని ఛిన్నాభిన్నం చేసేస్తున్నాడు. వారి తెలివితేటలకు సవాలు విసురుతున్నాడు. మేమతణ్ణి చంపేస్తాం. ఒక మనిషికి బదులుగా మరొక మనిషిని ఇస్తున్నాం, లెక్కసరిపోతుంది చాలదా?" అని అన్నారు. దానికి అబూ తాలిబ్, "దైవసాక్షి! మీరెంత నికృష్టమైన బేరానికి దిగారు నాతో. మీరేమో పెంచిపోషించి పెద్దజేయడానికి మీ పుత్రుణ్ణి నాకప్పగిస్తున్నారా? నా కుమారుణ్ణి చంపేయం డని మీకు అప్పజెప్పాలా? దైవసాక్షి! ఇది అయ్యే పని కాదు" అని కరాఖండిగా చెప్పేశారు.

దీనికి నౌఫిల్ బిన్ అబ్దె మునాఫ్ మనవడు ముత్‌యిమ్ బిన్ అద్దీ అందు కొని, "దైవసాక్షి! ఓ అబూ తాలిబ్! నీ జాతి ప్రజలు చేప్పేవి న్యాయ సమ్మతమైన మాటలే. నీకు అయిష్టమైన దాన్నుండి నిన్ను ఆపే ప్రయత్నం చేస్తున్నారు. మీరేమో ఏ ఒక్కరి మాటా వినేటట్లు అగుపించడం లేదు" అన్నాడు.

"దేవుడే సాక్షి! మీరేమీ న్యాయసమ్మతమైన మాటలు మాట్లాడటం లేదు. నీవు కూడా నన్నొదిలి నాకు వ్యతిరేకులైన వారి కొమ్ముకాస్తే కాయి. పో! ఏది జరగనుందో అదే జరిగితీరుతుంది."[54] అన్నారు అబూ తాలిబ్.

సీరత్ ఆధారాల్లో పై సంభాషణ జరిగిన సంవత్సరం ఏదో ఇతమిత్థంగా నిర్ణయం కాలేదు. ఈ రెండు సంభాషణలు బహుశా దైవదౌత్య శకం ఆరవ సంవత్సరం మధ్యభాగంలో జరిగి ఉండవచ్చని కొన్ని ఆధారాలు చెబుతున్నాయి. రెంటి నడుమ చాలా తక్కువ కాలమే గడిచి ఉండవచ్చు.

## ప్రవక్త (స) ను హత్య చేసే ఆలోచన

ఈ రెండుమార్లు అబూ తాలిబ్‌తో జరిగిన చర్చ ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వ నందున ఖురైష్ హింసాదౌర్జన్యాలకు సంబంధించిన భావోద్రేకాలు మరీ పెచ్చు పెరిగిపోయాయి. బాధలకు గురిచేసే క్రమం మునుపటి కంటే వేగం పుంజుకుంది. ఆ రోజుల్లోనే దైవధిక్కారుల మెదళ్ళలో, దైవప్రవక్త (స)ను హత్య చేయాలనే ఆలోచన వచ్చింది. ప్రవక్త (స)పై జరుగుతున్న ఈ హింసా దౌర్జన్యాల జోరు, ప్రవక్తశ్రీని హత్య చేసే ఆలోచన మక్కా నగరానికే చెందిన ఇద్దరు మహాయోధులు హజ్రత్ హమ్‌జా (ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు హజ్రత్

54. ఇబ్నె హష్షామ్-1/266,267.

https://teluguislam.net



ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)లను ఇస్లామ్ స్వీకరించేటట్లు ప్రేరేపించాయి. కాకపోతే అవి వారి ద్వారా ఇస్లామ్ ధర్మానికి బలం చేకూరడానికి దోహదపడ్డాయి.

హింసాకాండకు, ఆగడాలకు సంబంధించిన క్రమం అలా పెచ్చు పెరుగుతూనే పోయింది. రెండు ఉదాహరణలు ఇక్కడ వివరించదలిచాము.

ఓ రోజు అబూ లహబ్ కుమారుడు ఉతైబా ప్రవక్తశ్రీ వద్దకు వచ్చి, "వన్నజ్మిఇజాహవా" మరియు "సుమ్మదనా ఫతదల్లా"ను (అంటే ఖుర్‌ఆన్ ఆయత్‌లను) నేను తిరస్కరిస్తున్నాను అని చెప్పి కొట్టనారంభించాడు. ప్రవక్త (స) గారి చొక్కాను చింపేసి ముఖాన ఉమ్మివేశాడు. ఆ ఉమ్మి ఆయనపై పడలేదు. ఈ సందర్భంగా దైవప్రవక్త (స) అతణ్ణి, "ఓ అల్లాహ్! నీ కుక్కల్లోంచి దేన్నయినా ఇతనిపైకి ఉసిగొల్పు"అని శపించారు. దైవప్రవక్త పెట్టిన ఈ శాపాన్ని అల్లాహ్ మన్నించాడు. ఉతైబా ఓసారి ఖురైష్‌కు చెందిన కొందరు వ్యక్తుల వెంట ప్రయాణం చేయాల్సి వచ్చింది. సిరియా దేశంలో ఉన్న 'జర్కా' అనే ప్రదేశంలో విడిది చేశారు. రాత్రి పూట పులి ఆ బిడారం చుట్టూ తిరుగుతూ ఉండగా ఉతైబా చూశాడు. చూడగానే, "అయ్యో నా ఖర్మ! దైవసాక్షి! నన్ను చంపేయడానికే ఇది వచ్చింది. ప్రవక్త (స) ఆనాడు నన్ను శపించారు. చూడండి! నేను సిరియా దేశంలో ఉన్నాను. కాని ఆయన మక్కాలో ఉంటూ నన్ను చంపేస్తున్నాడు"అని అరిచాడు. అందరూ ఉతైబాను వారి పశువుల నడుమన ఉంచి చుట్టూ కాపలా కాశారు. కాని పులి వారందరిపై నుండి లంఘించి నేరుగా ఉతైబాను పట్టుకొని చీల్చిపారేసింది.[55]

ఓసారి ఉక్బా బిన్ ముఅయిత్, దైవప్రవక్త (స) సజ్దా చేస్తుండగా మెడను బలంగా త్రొక్కడం వల్ల ఆయన కళ్ళు బయటకు వచ్చినంత పనైంది.[56]

ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖించిన ఓ సుదీర్ఘ ఉల్లేఖనంలో కూడా హింసా దౌర్జన్యాలకు సంబంధించిన ఆగడాలను గురించి ప్రవక్త (స)ను హతమార్చే ప్రయత్నంపై వెలుగు పడుతోంది. ఈ ఉల్లేఖనంలో ఇలా చెప్పడం జరిగింది. ఓసారి అబూ జహల్ ఇలా అన్నాడు:

"ఖురైష్ సోదరులారా! ముహమ్మద్(స) మన ధర్మాన్ని ఎలా తూలనాడు

---

*55. ముక్తసుర్సీరత్-షేఖ్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 135; ఇస్తీయాబ్, అసాబా, దలాయ లెనుబువ్వత్, అర్రౌజుల్ అన్ఫ్.*

*56. ముక్తసుర్రసీరత్-పుట.113.*

https://teluguislam.net



తున్నాడో, మన తాత ముత్తాతలను ఎలా ఎత్తిపొడుస్తున్నాడో, మన బుద్ధీ వివేచనల్ని ఎలా సవాలు చేస్తున్నాడో మీకు తెలుసు. మన ఆరాధ్య దైవాలను కించపరిచే విధం ఎలాగుందో మీరెరుగుదురు. అందుకని నేడు నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఓ భారమైన బండరాయిని తీసుకొని కూర్చుని ముహమ్మద్ సజ్దా చేసినప్పుడు దాంతో ఆయన తల నుజ్జునుజ్జు అయ్యేటట్లు తలపై ఎత్తి వేస్తాను. ఆ తరువాత మీరు నన్ను అసహాయునిగా వదిలేస్తారో, నాకు సహాయపడతారో అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. అబ్దె మునాఫ్ కూడా వారి ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించినా సరే" అని ప్రతిజ్ఞ చేశాడు.

"లేదు, లేదు! దైవసాక్షి! మేము ఈ వ్యవహారంలో నిన్ను నిస్సహాయునిగా వదిలేసేవారం కాదు. నీవు చేసేది చేసి చూపించు" అని ఖురైష్ నాయకులంతా అతనికి ధైర్యం చెప్పారు.

తెల్లారగానే అబూ జహల్ బరువైన బండరాయినొకదాన్ని దగ్గర పెట్టుకొని ప్రవక్త (స) కోసం ఎదురు చూస్తున్నాడు. దైవప్రవక్త (స) మామూలుగా కాబా గృహం దగ్గరకొచ్చి నిలబడి నమాజులో నిమగ్నమయ్యారు. ఖురైష్ కూడా అక్కడ చేరి తమాషా చూస్తున్నారు. దైవప్రవక్త (స) 'సజ్దా' చేయగానే అబూ జహల్ బండరాయిని బలవంతంగా పైకి ఎత్తుకున్నాడు. మెల్లగా ఆయన వైపునకు కదిలాడు. దగ్గరకు రాగానే ఓడిపోయినవాడిలా వెనక్కు పారిపోయి వచ్చేస్తున్నాడు. అతని ముఖకవళికలు మారిపోయి ఉన్నాయి. ముఖాన రక్తం చుక్క లేదు. రెండు చేతుల్లో ఎత్తుకొని ఉన్న రాయి కూడా క్రిందపడనట్లు అతుక్కు పోయి ఉంది. ఎంతో కష్టం మీద దాన్ని క్రిందపడవేయగలిగాడు. అటు ఖురైష్‌కు చెందిన కొందరు లేచి అతని దగ్గరకు వచ్చి, "అబుల్ హకం! నీకేమైంది?" అని అడిగారు.

"నేను రాత్రి మీతో చెప్పినట్లుగానే చేయబోయాను, కాని ఆయన దగ్గరకు వెళ్ళగానే ఓ ఒంటె నాకు, ఆయనకు నడుమ వచ్చేసింది. దైవసాక్షి! నేనెప్పుడూ అలాంటి ఒంటెను చూడలేదు. భయంకరమైన దాని తలా, మెడ, పళ్ళు నేనిప్పటి వరకు ఎక్కడా చూడలేదు. అది నన్ను తినేయడానికి ముందుకు రాసాగింది" అని చెప్పాడు.

ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) ఆయనతో ఇలా అన్నారని

https://teluguislam.net



ఉంది."ఆయన జిబ్రీల్ (అ.స.). అబూ జహలే గనక నా దగ్గరకు వచ్చి ఉంటే, అతణ్ణి హతమార్చి పారేసేవారు."[57]

ఆ తరువాత అబూ జహల్ చేసిన మరో దుష్కృత్యం, హజ్రత్ ఉమర్ (ర)ను ఇస్లామ్ స్వీకరించేటట్లు చేసింది. వివరణ ముందు రాబోతోంది.

ఖురైష్‌కు చెందిన ఇతర దుర్మార్గుల విషయానికొస్తే, వారి మనస్సుల్లోనూ మహాప్రవక్త (స)ను అంతమొందించే ఆలోచన సతతం కెలకవేస్తూనే ఉంది. హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ ఆస్ (ర), ఇబ్నె ఇస్హాక్ (ర)తో ఇలా అన్నారని ఓ ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం,

"ఓసారి బహుదైవారాధకులు 'హతీమ్'లో సమావేశమై ఉన్నారు. అక్కడ నేనూ ఉన్నాను. బహుదైవారాధకులు ప్రవక్తశ్రీ (స)గారి ప్రస్తావన తెస్తూ, "అతని విషయంలో మేము వహించిన సహనానికి ఓ హద్దంటూ లేదు. నిజంగా మనం అతన్ని గురించి పెద్ద విషయంలో సహనం వహించాము" అని అంటూ ఉండగా ప్రవక్తశ్రీ అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఆయన కాబా గృహం దగ్గరకు వచ్చి ముందు హజ్రె అస్వద్‌ను ముద్దాడారు. ఆ తరువాత కాబా ప్రదక్షిణ చేస్తూ బహుదైవారాధకుల ప్రక్క నుండి వెళ్ళగా వారు ఆయన్ను తూలనాడారు. ఆ మాటల ప్రభావ ఛాయలు ఆయన ముఖారవిందంపై గోచరించాయి. ఆ తరువాత ప్రవక్తశ్రీ రెండోమారు ప్రదక్షిణలో మునుపటిలాగే బహుదైవారాధకుల ప్రక్క నుంచి వెళ్ళగా తిరిగి వారు ఆయన్ను దుర్భాషలాడారు. ఈసారి కూడా ఆయన ముఖంపై అసహనం కనిపించగా నేను చూశాను. ఆ తరువాత మూడోసారి వారి ప్రక్క నుండి వెళుతూ ఉండగా తిరిగి బహుదైవారాధకులు ఆయన్ను చూసి తిట్టారు. ఈసారి ఆయన ముందుకు కదలకుండా నిలబడి;

"ఖురైష్ ప్రజలారా! వింటున్నారా? ఏ దైవం చేతిలోనైతే నా ప్రాణం ఉందో, ఆ దైవం సాక్షి! నేను మీ వద్దకు బలిని గొనివచ్చాను" అని అన్నారు.

ఇంకేముంది! ఆయన ఈ వచనాలు ప్రజలను భయకంపితుల్ని చేశాయి. తమ తలలపై పక్షి కూర్చున్నట్లుగా నిశ్చేష్టులై అలానే ఉండిపోయారు. చివరికి ఆయనకు బద్ధశత్రువు అయిన వాడు కూడా, తాను బ్రతిమాలడానికి ఎంత మంచి పదాన్ని ఎంచుకొని బ్రతిమాలగలడో ఆ పదాలను పలికి క్షమాపణ కోరుకో నారంభించాడు. "అబుల్ ఖాసిం వెనక్కు వెళ్ళిపోండి. దైవసాక్షి మీరు ఎన్నడూ అమాయకులుగా ఉండలేదు" అని ప్రాధేయపడనారంభించారు.

57. ఇబ్నె హష్షామ్-1/298,299.

https://teluguislam.net



మరుసటి దినం ఖురైష్ తిరిగి అక్కడ చేరి దైవప్రవక్త (స) ప్రస్తావనను ఎత్తారు. ఆయన రాగానే అందరూ మూకుమ్మడిగా ఆయనపై విరుచుకు పడ్డారు. ఆయన్ను చుట్టుముట్టారు. నేను చూస్తూ ఉండగానే ఓ వ్యక్తి ఆయన మెడకు ఆయన అంగవస్త్రాన్ని చుట్టి దానిని మెలివేయనారంభించాడు. అబూ బక్ర్ (ర) వచ్చి ప్రవక్తశ్రీని రక్షించడంలో నిమగ్నులయ్యారు. ఆయన రోదిస్తూ, మీరు ఓ వ్యక్తిని కేవలం, ఆయన అల్లాహ్ తన పోషకుడు అని అంటున్నం దుకు చంపేస్తున్నారా? అని పలుకనారంభించారు. ఆ తరువాత బహుదైవా రాధకులు ఆయన్ను వదిలేసి వెళ్ళిపోయారు. అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ ఆస్(ర), "దైవప్రవక్త (స)పై జరిగిన ఆ దాడి, హింసించిన ఆ తీరు నేను ఎన్నడూ చూడలేదు" అని అంటారు.[58]

సహీ బుఖారిలో హజ్రత్ ఉర్వా బిన్ జుబైర్ (ర), "నేను అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ ఆస్ (ర)ను, బహుదైవారాధకులు ప్రవక్త (స) ఎడల ప్రవర్తించిన తీవ్రమైన తీరు ఎలాంటిదో వివరించండి" అని అడిగాను. దానికి ఆయన(ర) ఇలా చెప్పారు.

దైవప్రవక్త (స) కాబా గృహాన్ని ఆనుకొని ఉన్న హతీమ్ అనే స్థలంలో నమాజు చేస్తున్నారు. అంతలోనే ఉక్బా బిన్ ముఅయిత్ అక్కడకు వచ్చి తన అంగవస్త్రాన్ని ఆయన (స) మెడకు చుట్టి మెలిత్రిప్పి గొంతు నులిపే ప్రయత్నం చేస్తున్నాడు. అంతలో హజ్రత్ అబూ బక్ర్ (ర) అక్కడికి పరుగున వచ్చి అతని రెండు గూడలను పట్టుకొని దూరంగా త్రోస్తూ, "మీరు ఓ వ్యక్తిని, ఆయన అల్లాహ్యే తన పోషకుడు అని అంటున్నందుకు చంపేస్తున్నారా?" అని అడిగారు.[59]

హజ్రత్ అస్మా (ర)గారి ఉల్లేఖనంలో ఇంకొంత వివరణ ఉంది. అదేమి టంటే, "నేను హజ్రత్ అబూ బక్ర్ (ర) వద్దకు, 'నీ మిత్రుణ్ణి రక్షించు' అని అరుస్తూ వెళ్ళాను. ఆయన వెంటనే మా దగ్గర నుండి లేచి అక్కడికి పరుగు తీశారు. ఆయన అప్పుడు తన తలను నాల్గుపాయలుగా దువ్వుకొని ఉన్నారు. "మీరు ఓ వ్యక్తిని, అతను అల్లాహ్యే తన పోషకుడు అంటున్నందుకు హత్య చేస్తున్నారా?" అంటూ అరిచారు. తిరిగి వచ్చిన తరువాత ఆయన పరిస్థితి, తల

---

58. ఇబ్నె హిషామ్-1/289, 290.
59. సహీ బుఖారి-1/544.

https://teluguislam.net



వెంట్రుకల్ని వ్రేళ్ళతో పట్టుకోగా అవి ఊడివచ్చేటంత గంభీరంగా మారి పోయింది."[60]

## హజ్రత్ హమ్‌జా (ర)గారి ఇస్లామ్ స్వీకారం

మక్కా వాతావరణం హింసాదౌర్జన్యాల కారుమేఘాలతో గంభీరంగా ఉంది. అంతలోనే ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపుకు పీడితుల మార్గంలో వెలుగు విరజిమ్మినట్లయింది. అదే! ఆ మెరుపు హజ్రత్ హమ్‌జా (ర)గారి ఇస్లామ్ ధర్మ స్వీకారం. ఆయన ఇస్లామ్ స్వీకరించిన సంఘటన దైవదౌత్యపు ఆరవ శకపు చివరి సంఘటన. అంటే, ఆయన జిల్‌హజ్జా మాసంలో ఇస్లామ్ స్వీకరించారు.

ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడానికి పురిగొల్పిన పరిస్థితి ఏమిటంటే; ఓ రోజు అబూ జహల్ సఫా కొండ వద్ద దైవప్రవక్త (స) కూర్చుని ఉన్న చోటి నుండి వెడుతూ ఆయన్ను హింసించి, దుర్భాషలాడాడు. దైవప్రవక్త (స) ఏమీ అనకుండా కూర్చున్నారు. అయితే అతను ఆయన తలపై ఓ రాయిని విసరి వేశాడు. ఆ రాయి తగలడం వలన తల నుండి రక్తం స్రవించనారంభించింది. ఆ తరువాత అతను వెళ్ళి కాబా గృహం దగ్గర తన మిత్రబృందంలో చేరి కూర్చున్నాడు. అబ్దుల్లా బిన్ జుద్‌ఆన్ స్త్రీ బానిస అదంతా గమనిస్తూ ఉంది. ఆమె ఇల్లు సఫా కొండపైన్నే ఉంది. హజ్రత్ హమ్‌జా (ర) విల్లంబులు ధరించి వేట నుండి తిరిగి వస్తుండగా ఎదురుగా వెళ్ళి విషయమంతా చెప్పేసింది. హజ్రత్ హమ్‌జా (ర) కోపోద్రేకంతో ఊగిపోయారు. ఈయన ఖురైష్‌కు చెందిన అత్యంత శక్తిశాలి, దృఢకాయుడైన యువకుడు. దాసీ చెప్పిన విషయాలను విని ఒక్క క్షణం కూడా జాగు చేయకుండా, అబూ జహల్ కనబడగానే అతణ్ణి చితకబాదాలనే ఉద్దేశ్యంతో హుటాహుటిన అక్కడికి చేరారు. మస్జిదె హరాం లోనికి వెళ్ళి అతనికి ఎదురుగా నిలబడి, "ఒరేయ్ పిరికిపందా! నీవు నా సోదర కుమారుణ్ణి తిడతావా? నేను కూడా ఆయన ధర్మాన్నే స్వీకరించాను తెలుసా?" అంటూ విల్లుతో అబూ జహల్ తలపై ఒక్క దెబ్బ వేశారు. ఆ దెబ్బకు అతని తల బద్దలుగా పగిలిపోయింది. ఇది చూసిన బనూ మగ్జూమ్ తెగ, హమ్‌జా (ర) గారి తెగ బనూ హాషిమ్, ఒకరిపై ఒకరు తలపడ్డారు. కాని అబూ జహల్ వారిని

60. ముక్తరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా, పుట-113.

https://teluguislam.net



వారిస్తూ, "పోనిద్దురూ! అబూ అమ్మారాను ఏమనకండి. నేను నిజంగానే ఆయన అబ్బాయిని బహుచెడ్డగా తిట్టాను" అని అన్నాడు.[61]

మొదట హజ్రత్ హమ్జా, తన బంధువును అగౌరవంపాల్జేసినందుకు రోషపడుతూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారుగాని, అల్లాహ్ ఆ తరువాత ఆయన హృదయాన్ని ఆ ధర్మం కోసం తెరిచాడు. ఆయన ఇస్లామ్ ధర్మాన్ని దృఢంగా పట్టుకోవడం జరిగింది.[62]

ముస్లిములకు ఆయన ద్వారా గొప్ప గౌరవం, శక్తి లభించాయి.

## హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకారం

జులుం, హింసాదౌర్జన్యాల కారుమేఘాల ఈ భయానక వాతావరణంలో మరో మెరుపు మెరిసింది. దీని వెలుగు మునుపటి వెలుగుకన్నా కళ్ళు మిరుమిట్లుగొలిపేదిగా ఉంది. అంటే, హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్‌ను స్వీకరించారన్న మాట. ఈయన ఇస్లామ్ స్వీకరించిన సంఘటన జరిగింది కూడా దైవదౌత్య శకపు ఆరవ సంవత్సరంలోనే,[63] ఈయన హజ్రత్ హమ్జా (ర) ఇస్లామ్ స్వీకరించిన మూడవ రోజునే ముస్లిమయ్యారు. దైవప్రవక్త(స) ఇస్లామ్‌ను స్వీకరించేలా చెయ్యమని దుఆ కూడా చేసి ఉన్నారు. ఇమామె తిర్మిజీ (రహ్మాలై), ఇబ్నె ఉమర్ ఉల్లేఖనాన్ని ఉల్లేఖిస్తూ ఈ దుఆను ప్రామాణికమైందిగా ఖరారు చేశారు. అలాగే, తిబ్రానీ, హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్ మరియు హజ్రత్ అనస్ (ర)ల ఉల్లేఖనాలను ఉల్లేఖిస్తూ దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారని అంటారు.

**"అల్లాహుమ్మ అఇజ్జిల్ ఇస్లామ బిఅహబ్బి ర్రజులైని ఇలైక. బి ఉమరి బన్ ఖత్తాబ్ అవ్ బి అబీజహ్లి బిన్ హష్షామ్."**

అర్థం : ఓ ప్రభూ! ఉమర్ బిన్ ఖత్తాబ్ లేదా అబూ జహ్లె బిన్ హష్షామ్ వీరిద్దరిలో నీకు ప్రియమైన వారి ద్వారా ఇస్లామ్‌ను శక్తివంతం చెయ్యి.

(అల్లాహ్ ఈ దుఆను స్వీకరించడం వల్ల హజ్రత్ ఉమర్ (ర) ముస్లిమై పోయారు) అల్లాహ్ దృష్టిలో ఈ ఇద్దరిలో ఒక్క హజ్రత్ ఉమర్ (ర) మాత్రమే

---

61. ముక్తసరుస్సీరత్, షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లా పుట.66; రహ్మాతుల్ లిల్ ఆలమీన్-1/68, ఇబ్నె హష్షామ్-1/291,292.
62. ముక్తసరుస్సీరత్- షేఖ్ అబ్దుల్లా, పుట.101.
63. తారీఖ్ ఉమర్‌బిన్ ఖత్తాబ్- అల్ ఇబ్నెజూజీ పుట.11.

https://teluguislam.net



ప్రియమైనవారు.[64]

హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకారానికి సంబంధించిన మొత్తం ఉల్లేఖనాలను అధ్యయనం చేసిన తరువాత, ఆయన మనస్సులో ఇస్లామ్ ధర్మ ఔన్నత్యం క్రమక్రమంగా వేళ్ళూనుకుందని తెలుస్తోంది. ఈ ఉల్లేఖనాలన్నిటిని వివరించేముందు హజ్రత్ ఉమర్ (ర) గారి భావోద్రేకాలు, ఆయన ప్రవృత్తి, ఆయన వ్యక్తిత్వాలను గురించి కూడా తెలుసుకోవటం అవసరం.

హజ్రత్ ఉమర్ (ర) తన దుడుకుతనంలో, కాఠిన్యంలో బాగా పేరు మోసినవారు. ముస్లిములు ఓ సుదీర్ఘ కాలం వరకు ఆయన పెట్టిన హింసలకు గురై ఉన్నారు. ఆయన వ్యక్తిత్వంలో రెండు విభిన్న రకాల భావోద్రేకాలు సంఘర్షించుకుంటున్నాయా అన్నట్లు అగుపడేది. ఆయన ఓ వైపు తాత ముత్తాతలు ప్రవేశపెట్టిన ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ ఉండడం, రక్తపాతం అంటే ఉత్సాహం చూపడానికి ఇష్టపడేవారు. కాని మరో ప్రక్క విశ్వాస మార్గంలో ముస్లిములపై జరుగుతున్న దమనకాండను వారు ఎంతో దృఢచిత్తంతో సహించడాన్ని కూడా ఆశ్చర్యచకితులై వారి ధైర్యానికి జోహార్లు అర్పించే దృష్టితో చూసేవారు. అదే కాకుండా, ఓ బుద్ధిమంతునికి ఉండవలసిన లక్షణాల్లో వలె ఆయన మనస్సులో ఆ విషయం గురించి అనుమానాలు కూడా పొడసూపుతూ ఉండేవి. ఇస్లామ్ దేని వైపునకయితే పిలుస్తోందో, బహుశా అదే సరి అయిన, మేలైన మార్గమేమోననే ఆలోచన కూడా అప్పుడప్పుడు ఆయన మెదడులో మెదలుతూ ఉండేది. కాబట్టి ఆయన పరిస్థితి ఒక్కసారే మండి చల్లారిపోయే అగ్నిలా ఉండేది.[65]

హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకార సంఘటనా వివరాలు, దాదాపు అన్ని ఉల్లేఖనాల ప్రకారం ఇలా ఉన్నాయి:

ఓసారి ఆయన ఇంటికి వెలుపల రాత్రి గడపవలసి వచ్చింది. ఆయన హరమ్ (కాబా మస్జిద్)కు వచ్చి కాబాలోని పరదాలోకి దూరిపోయారు. అప్పుడు మహాప్రవక్త (స) నమాజు చేస్తూ అల్ హాఖ్ఖా సూరా పఠిస్తూ ఉన్నారు. హజ్రత్ ఉమర్ (ర) ఆ పారాయణాన్ని వింటూ దాని శైలికి ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన కథనం ప్రకారమే, "నేను నా మనస్సులో, దైవసాక్షి! ఖురైష్ ప్రజలు అనుకుంటున్నట్లుగానే ఆయన 'ఓ కవే' అని అనుకున్నాను" అంతలోనే దైవ

---

*64. తిర్మిజీ, అబుహబుల్ మనాఖిబ్, మనాఖిబ్ అబీహఫ్జీ ఉమర్‌బిన్ ఖత్తాబ్-2/209.*
*65. హజ్రత్ ఉమర్(ర) గారి ఈ పరిస్థితి షేఖ్ ముహమ్మద్ గజాలి వివరించినది.*

https://teluguislam.net



ప్రవక్త(స) ఈ ఆయత్ పఠించారు. **వలా బిఖౌలి కాహినిన్ ఖలీలమ్ మా తజక్కరూన తన్‌జీలుమ్ మిర్ రబ్బిల్ ఆలమీన.** (69:42,43)

అర్థం : (కాదు) ఇది ఓ గౌరవనీయుడైన ఒక సందేశహరుని వాక్కు, ఏ కవికి చెందిన వాక్కు కాదు. కాని మీరు విశ్వసించడం అనేది చాలా తక్కువ.

నేను తిరిగి నా మనసులో ఓహో! అయితే ఈయన ఓ జ్యోతిష్యుడు అని అనుకున్నాను. అంతలోనే దైవప్రవక్త (స) ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని పఠించారు.

**ఇన్నహూ లఖవ్‌లు రసూలిన్ కరీమ్. వమాహువ బిఖవ్‌లి షాయిర్ ఖలీలమ్ మా త్కుమినూన్.**

**"ఇంకా ఇది ఏ జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు. మీరు ఆలోచించడం అనేది చాలా తక్కువ. ఇదసలు సకల లోకాల ప్రభువు తరపు నుండి అవతరించింది."** (69:40,41)

అప్పుడే నా హృదయంలో ఇస్లామ్ ధర్మ ఔన్నత్యం జాగృతమైంది[66] అని చెప్పారు.

హ॥జత్ ఉమర్ (ర) గారి హృదయఫలకంపై ఇస్లామ్ ముద్రింపబడిన ప్రప్రథమ సందర్భం అది. అయితే ఆయనలో, అజ్ఞానపు భావోద్రేకాలు, అంధానుకరణ, తాతముత్తాతల ఆచార సంప్రదాయాల గొప్పదనపు ఛాయలు మాత్రం తొలగిపోలేదు. హృదయాంతరంగంలో మెదిలే యదార్థం బయటకు రాలేకపోయింది. అందుకని ఆయన తనలో దాగివున్న అంతరాత్మ ఘోషను లెక్క చేయకుండా ఇస్లామ్ విద్వేషంలో నిమగ్నమయ్యే ఉన్నారు.

ఆయన ఈ సహజ కఠిన ధోరణిలో కొట్టుకుపోతూ, మహాప్రవక్త (స) ఎడల విద్వేషాన్ని ప్రకటిస్తూ ఓ రోజు స్వయంగా ఖడ్గధారుడై ప్రవక్తశ్రీని అంత మొందించటానికి బయలుదేరారు. కాని దారిలో నుయీమ్ బిన్ అబ్దుల్లా

---

*ఫిక్హ్హు సీరత్-పుట, 92,93.*

*66. తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్ - అల్ ఇబ్నుల్ జూజీ, పుట 6. ఇబ్నె ఇస్‌హాక్, అతా మరియు ముజాహిద్ ఉల్లేఖనాన్ని దాదాపు ఇలాగే నకలు చేశారు. అయితే ఈ ఉల్లేఖనంలోని చివరి ముక్క మరోలా ఉంది. చూడండి, సీరత్ ఇబ్నె హిషామ్-1/ 346, 348. ఇంకా ఇబ్నె జూజీ స్వయంగా హ॥జత్ జాబిర్(ర)గారి ఉల్లేఖనాన్ని దాదాపు ఇలానే నకలు చేశారు. అయితే దాని చివరి భాగంలో కూడా కొంత తేడా కనిపిస్తోంది. చూడండి, తారీఖ్ ఉమర్ ఇబ్నుల్ ఖతాబ్- పుట.9-10.*

https://teluguislam.net



అల్ఖామ్ అద్వీని[67] లేదా బనీ జుహ్రా[68] లేదా బనీ మగ్జూమ్‌కు చెందిన ఓ వ్యక్తి[69]ని కలుసుకోవడం జరిగింది. అతను హజ్రత్ ఉమర్ వాలకం చూసి, "ఉమర్! ఎక్కడికి వెళుతున్నావు" అని అడిగాడు.

"ముహమ్మద్ (స)ను హతమార్చడానికి" అని నిర్లక్ష్యంగా జవాబిచ్చారు ఉమర్.

"ముహమ్మద్ (స)ను హతమార్చి బనూ హాషిమ్ మరియు బనూ జుహ్రా నుండి ఎలా తప్పించుకోగలవు?" అని ప్రశ్నించాడు.

"ఓహో! అయితే నీ వెనుకటి మతాన్ని వదిలేశావన్న మాట" అని ఎత్తిపొడిచారు ఉమర్.

"అయితే విను. నేనో ఆశ్చర్యకరమైన వార్త చెబుతున్నాను. నీ సోదరి మరియు ఆమె భర్త ఇద్దరూ నీ ధర్మాన్ని వదలి ధర్మభ్రష్టులయ్యారు. ఇది నీకు తెలుసా?" అని అడిగాడు ఆ వ్యక్తి.

ఇది విన్న ఉమర్ (ర) గారి ఉక్రోషానికి, రౌద్రానికి హద్దులేకుండా పోయింది. నేరుగా సోదరి, ఆమె భర్త ఉన్న చోటికి బయలుదేరారు. ఆ ఇంట వారికి హజ్రత్ ఖబ్బాబ్ (ర) బిన్ అరత్, 'తాహా' సూరా రాసి ఉన్న గ్రంథపత్రాన్ని పఠింపజేస్తున్నారు. ఖుర్ఆన్ బోధించడానికి హజ్రత్ ఖబ్బాబ్ (ర) రావడం మామూలే. హజ్రత్ ఖబ్బాబ్ (ర) ఉమర్ రాకను గమనించి ఇంటిలోనికి వెళ్ళి దాక్కున్నారు. ఇటు హజ్రత్ ఉమర్ సోదరి ఫాతిమా (ర) ఆ పత్రాన్ని దాచేశారు. అయితే హజ్రత్ ఉమర్ (ర) ఇంటి దాపుకు రాగానే అప్పటికే హజ్రత్ ఖబ్బాబ్(ర) గారి పారాయణ స్వరం ఆయన చెవుల్లోబడి ఉంది. లోనికి ప్రవేశిస్తూనే, "నేను ఇప్పుడే ఆ మందస్వరంలో విన్నది ఏమిటి?" అని అడిగారు. "అదేమిలేదే! మేము మాట్లాడుకుంటున్నాం అంతే! " అని బదులిచ్చారు వారు.

"మీరు బహుశా ధర్మభ్రష్టులైపోయారనుకుంటాను" అని అడగ్గా ఆయన బావగారు అందుకొని, "ఉమర్! సత్యం అనేది మీ ధర్మంలో కాకుండా మరే ధర్మంలోనైనా ఉండి ఉంటే? (అప్పుడు ఏం చేస్తారు?)" అని అడిగేశారు. హజ్రత్ ఉమర్ ఈ మాటల్ని వినగానే కోపావేశంతో బావను చితకబాదేశారు.

---

*67. ఇది ఇబ్నె ఇస్హాక్ కథనం, చూడండి. ఇబ్నె హష్షామ్-1/344.*

*68. తారీఖ్ ఇబ్నె ఖత్తాబ్ అల్ ఇబ్నె జూజీ-పుట. 10; ముక్తతరుస్సీరత్-షేక్ అబ్దుల్లా, పుట. 103.*

*69. ఇబ్నె అబ్బాస్ (ర) వారి ఉల్లేఖనం చూడండి. ముక్త మెరస్సీరత్ డిటో-పుట. 102.*

https://teluguislam.net



ఆయన సోదరి, భర్తను రక్షించే ఉద్దేశ్యంతో ఆయన్ను ఉమర్ బారి నుండి ప్రక్కకు లాగారు. అంతే! పెళ్ళుమని గట్టిగా ఓ చెంపదెబ్బ వేశారు సోదరి చెక్కిలిపై. దానితో ఆమె ముఖం రక్తసిక్తమైపోయింది. ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనం ప్రకారం, ఆమె తలకు కూడా దెబ్బ తగిలింది. సోదరికి కూడా కోపం వచ్చి, "ఉమర్! నీ ధర్మం కాకుండా మరే ధర్మమే సత్యం అయినట్లయితే నీవేమి చేస్తావు?" అని ప్రశ్నించారు. **అష్హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్** (అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను) అని గట్టిగా పలికారు. ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర) నిశ్చేష్టులైపోయి ఎటూ తోచక నిలబడిపోయారు. ఆయన తన సోదరి ముఖంపై రక్తాన్ని చూసి సిగ్గుపడ్డారు.

"ఏదీ మీ వద్ద ఉన్న ఆ గ్రంథాన్ని నాకివ్వండి, నేనూ చదువుతాను" అని అడిగారు. "లేదు! నీవు అపవిత్రుడవు. ఈ గ్రంథాన్ని కేవలం పరిశుద్ధులైనవారే తాకగలరు. లే! లేచి స్నానం చేసిరా" అని తెలిపారు.

హజ్రత్ ఉమర్ వెళ్ళి స్నానం చేసివచ్చారు. ఆ గ్రంథాన్ని చేతబట్టుకొని చదవనారంభించారు. **"బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం"** (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను). నోట ఈ పలుకులు వెలువడగానే, "ఓహో! ఇది ఎంత పరిశుద్ధమైన నామం!" అంటూ తాహా సూరా ప్రారంభించి **"ఇన్ననీ అనల్లాహ్ లా ఇలాహ ఇల్లా అన ఫఅబుద్నీ వ అఖిమిస్సలాత లిజిక్రీ." (20:14)**

అర్థం:- "నేను అల్లాహ్ను. నేను తప్ప మరొకడు దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చెయ్యి. నా జ్ఞాపకం కోసం నమాజును స్థాపించు" వరకు చదివి, "ఇది ఎంత మహత్తరమైన వాక్కు, ఎంత పరిశుద్ధమైన వచనం! ముహమ్మద్ ఎక్కడున్నారో తెలుపండి" అని అడిగారు.

ఈ మాటలు వింటున్న హజ్రత్ ఖబ్బాబ్ (ర) లోపలి నుండి బయటకు వచ్చి, "ఉమర్! సంబరపడు! దైవప్రవక్త (స) గురువారం రాత్రి నీ గురించి చేసిన దుఆ (ఓ అల్లాహ్! ఉమర్ బిన్ ఖత్తాబ్ లేదా అబూ జహల్ బిన్ హిషామ్ వీరిద్దరిలో నీకు ఎవరు ప్రియులో వారి ద్వారా ఇస్లామ్ను శక్తివంతం చెయ్యి) ప్రభావమే ఇది. ఇప్పుడాయన సఫా కొండపై ఉన్న గృహంలో ఉన్నారు" అని చెప్పారు.

https://teluguislam.net



ఇది విన్న హజ్రత్ ఉమర్ ఖడ్గాన్ని చేతబూనారు. సఫా కొండపై దైవ ప్రవక్త (స) ఉన్న ఇంటి గుమ్మం దగ్గరకు వచ్చి తలుపుతట్టారు. ఒకాయన లేచి తలుపు సందులో నుండి బయటకు తొంగిచూడగా అక్కడ హజ్రత్ ఉమర్ ఖడ్గాన్ని పట్టుకొని నిలబడి ఉన్నారు. వెంటనే వెనక్కు వెళ్ళి దైవప్రవక్త (స)తో తాను చూసింది చెప్పాడు. అందరూ ఒక చోట గుమిగూడారు. హజ్రత్ హమ్‌జా (ర) ఏమిటి అని అడగ్గా, బయట ఉమర్ (ర) నిలబడి ఉన్నాడు అని చెప్పారు. దానికి హజ్రత్ హమ్‌జా (ర), "చాలు! ఉమరా? తలుపు తెరువండి. ఒకవేళ ఆయన సదుద్దేశ్యంతో వచ్చి ఉంటే ఆయనకు మేలు జరుగుతుంది. చెడు ఉద్దేశ్యంతో వస్తే మాత్రం మేము ఆ ఖడ్గంతోనే అతణ్ణి అంతమొందిద్దాం" అని అన్నారు. ఇటు దైవప్రవక్త (స) లోన కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో ఆయనపై దైవవాణి అవతరిస్తూ ఉంది. దివ్యవాణి అవతరణ ఆగిపోగానే ఆయన ఉమర్ (ర) దగ్గరకు వచ్చి తాను కూర్చున్న ప్రదేశానికి తీసుకుని వెళ్ళారు. ఆయన చొక్కా మరియు ఖడ్గం పిడిని ఒడిసిపట్టుకొని ఊపుతూ, "ఉమర్! అల్లాహ్ వలీద్ బిన్ ముగైరాపై అవతరింపజేసిన శిక్షలాంటిది నీపై అవతరింపజేయనంతమట్టుకు నీవు నీ వైఖరిని మార్చుకోవా? ఓ అల్లాహ్! ఇతను ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)! ఓ ప్రభూ! ఇస్లామ్ ధర్మాన్ని ఉమర్ బిన్ ఖత్తాబ్ ద్వారా శక్తివంతం చెయ్యి, గౌరవం ఒసగు" అని ప్రార్థించారు. దైవప్రవక్త (స) గారి ఈ మాటలకు హజ్రత్ ఉమర్ ఇస్లామ్ ఛత్రఛాయలోనికి ప్రవేశిస్తూ, **"అష్‌హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహ్ వ ఇన్నక రసూలుల్లాహ్"** (అల్లాహ్ తప్ప వేరే పూజ్యుడెవడూ లేడని, మీరు అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను) అనే కలిమా చదివారు. అక్కడ గుమిగూడిన వారు ఈ వచనాలు విన్నంతనే 'అల్లాహు అక్బర్' అనే తక్బీర్‌ను, మస్జిదె హరాంలో కూర్చుని ఉన్న వారందరికి వినిపించేటంత బిగ్గరగా పలికారు.[70]

హజ్రత్ ఉమర్ (ర) గారి శక్తికి ఎదురు వచ్చే ధైర్యం ఎవ్వరూ చేయలేరన్న విషయం మనకు తెలిసిందే. ఆయన ముస్లిమ్ అయిపోయారన్న వార్త తెలియగానే బహుదైవారాధకుల్లో గుబులుపుట్టింది. తలవంపు అయినట్లు భావించారు. మరోప్రక్క ఆయన ఇస్లామ్ స్వీకారం వలన ముస్లిములకు గొప్ప

---

*70. తారీఖ్ ఉమర్ బినుల్-ఖత్తాబ్ పుట.7,10,11- ముక్తరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్, పుట. 102,103; సీరత్ ఇబ్నె హష్షామ్-1/343-346.*

https://teluguislam.net



గౌరవం, శక్తి లభించాయి. చెప్పలేని ఆనందం కలిగింది. ఇబ్నె ఇస్హాక్, హజ్రత్ ఉమర్ (ర) గారి ఉల్లేఖనాన్ని ఉల్లేఖిస్తూ ఇలా రాస్తున్నారు.

"నేను ముస్లిమ్‌కాగానే, మక్కాలో దైవప్రవక్త (స)ను విరోధించడంలో ఎవరు ముందడుగులో ఉన్నారు? అని ఆలోచించాను. అతను అబూ జహల్ ఒక్కడే అని తలచి అతని ఇంటి గుమ్మంలోనికి వెళ్ళి తలుపుతట్టాను. అతను బయటకు వచ్చి నన్ను చూసి స్వాగతం, సుస్వాగతం. ఏమిటి ఇలా వచ్చారు అని అడిగాడు. నేను అతనితో, నేను ఇస్లామ్ స్వీకరించాను. దాన్ని సత్యధర్మ మని ధృవీకరిస్తున్నాను అని చెప్పగానే, (అది విన్న అతడు) నేను అక్కడ నిలబడి ఉండగానే తలుపులు మూసేసుకుంటూ "అల్లాహ్ నిన్ను నాశనం చేయా! నీవు నా వద్దకు తెచ్చిన వార్త కూడా నాశనం కానూ!" అన్నాడు.[71]

ఇమామ్ ఇబ్నె జూజీ, హజ్రత్ ఉమర్ ఉల్లేఖనాన్ని ఇలా ఉల్లేఖిస్తున్నారు. "ఎవరైనా ముస్లిముగా మారిపోతే వీరు అతని వెంటపడి హింసించేవారు. నేనూ వారిని బాదేవాణ్ణి. నేను ముస్లిముగా మారిపోయిన తరువాత నా మేనమామ ఆసీ బిన్ హాషిమ్ ఇంటికి వెళ్ళి నేను ముస్లిముగా మారానని చెప్పాను. అతను కూడా ఇంటిలోనికి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు. ఆ తరువాత ఖురైషుకు చెందిన పెద్ద మనిషి వద్దకు వెళ్ళాను (బహుశా ఇతను అబూ జహల్ కావచ్చు). అతనికి ఈ విషయం చెప్పగానే అతనూ ఇంటిలోనికి వెళ్ళిపోయాడు." [72]

ఇబ్నె హష్షామ్ మరియు ఇబ్నె జూజీల కథనం ప్రకారం, హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించగానే జమీల్ బిన్ మోమర్ హమ్జీ ఇంటికి వెళ్ళారు. ఇతను వార్తల్ని ప్రజల్లో వ్యాపింపజేయడంలో ఖురైష్ మొత్తంలో అగ్రగణ్యుడు. హజ్రత్ ఉమర్ అతని వద్దకు వెళ్ళి తాను ముస్లిముగా మారిపోయాననే వార్తను వినిపించారు. ఇది విన్న అతను పెద్దపెట్టున అరుస్తూ ఖత్తాబ్ కుమారుడు మార్గభ్రష్టుడయ్యాడొహో! అని అరిచాడు. హజ్రత్ ఉమర్ ఆయన వెనుకాలే నిలబడి, "ఇతను అసత్యమాడుతున్నాడు, నేను ముస్లిమునైపోయాను" అని పలికారు. ప్రజలు ఆయనపై విరుచుకుబడ్డారు. దొమ్మి ప్రారంభం అయింది. ప్రజలు హజ్రత్ ఉమర్‌ను బాదుతూ ఉంటే ఆయన వారిని బాదుతున్నారు. ఈ క్రమం సూర్యుడు నెత్తిమీదికి వచ్చినంతసేపు సాగింది. హజ్రత్ ఉమర్ అలసి

71. ఇబ్నె హష్షామ్-1/349, 350.
72. తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్-పుట. 8

https://teluguislam.net



పోయి ఓ చోట కూర్చున్నారు. ఖురైష్ ప్రజలు ఆయన్ను కొడుతూనే ఉన్నారు. "మీకు చేతనైనది చేసుకోండి! దైవసాక్షి! మా సంఖ్య మూడొంద లుంటే, మక్కాలో మీరైనా ఉండేవారు లేదా మేమైనా ఉండేవారం" అని అన్నారు.[73]

ఆ తరువాత బహుదైవారాధకులు, ఉమర్(ర)ను చంపేసే ఉద్దేశ్యంతో ఆయన ఇంటిమీదికి వచ్చారు. సహీబుఖారీలో హ(జత్ ఉమర్ (ర) గారి ఉల్లేఖనం ఇలా ఉంది; నేను భయం చేత నా ఇంటిలో కూర్చుని ఉండగా, అబూ అమ్రూ బిన్ ఆస్ బిన్ వాయిల్ అక్కడికి వచ్చాడు. అంచుగల యమనీ దుప్పటితో తయారు చేసిన అంగవస్త్రం, పట్టు అంచు కలిగిన చొక్కా తొడుక్కుని ఉన్నాడు. అతను 'సహమ్' తెగకు చెందినవాడు. ఈ తెగ అజ్ఞాన కాలంలో (అంటే నేను ఇస్లామ్ స్వీకరించకమునుపు) మాకు మిత్రపక్షంగా ఉండేది. అతను నన్ను చూసి, ఏమైందని అడిగాడు. దానికి సమాధానంగా, "నేను, ముస్లిమునైపోయాను ఆ కారణంచేత మీ జాతి నన్ను చంపేయాలని చూస్తోంది" అని అన్నాను.

"ఇది అసాధ్యం!" అని అతను నాకు భరోసా ఇచ్చాడు. ఆ భరోసాతో నాకు సాంత్వన చేకూరింది. ఆస్ అక్కడ నుండి బయటకు వచ్చాడు. అప్పుడు ఆ లోయంతా ప్రజలతో కిటకిటలాడుతోంది. ఆస్ వారినుద్దేశించి మీ ఉద్దేశ్యం ఏమిటి? అని అడగ్గా, వారు ఈ ఖత్తాబ్ కుమారుడే మాకు కావాలి. ఇతను ధర్మభ్రష్టుడైపోయాడు అని అన్నారు. "లేదు! మీరు ఆయన దగ్గరకు పోయే మార్గం లేదు" అని పలకగా ప్రజలంతా ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు.[74] "దైవసాక్షి! అది ఓ వస్త్రం. దాన్ని పై నుండి దులిపి క్రిందికి పారవేసేటట్లుంది ఆ పరిస్థితి" అని ఉంది.[75]

హ(జత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించినప్పుడు బహుదైవారాధకుల పరిస్థితి అది. ఇక మిగిలింది ముస్లిముల పరిస్థితి, ఇబ్నె అబ్బాస్ (ర) ముజాహిద్‌తో చెప్పిన మాటల ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం ఇలా ఉంది.

"నేను ఉమర్ (ర) ను అడిగాను. మీకు ఫారూఖ్ అనే బిరుదు ఎలా

---

*73. తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్-పుట. 8; ఇబ్నె హష్షామ్-1/348, 349.*

*74. సహీబుఖారి, ఇస్లామ్ అధ్యాయం, ఉమర్ బిన్ ఖత్తాబ్-1/545, ఇబ్నె ఇస్హాక్ గారి ఓ ఉల్లేఖనం ప్రకారం.*

*75. ఇబ్నె హష్షామ్-1/349.*

https://teluguislam.net



వచ్చింది అని. ఆయన నాతో, నాకు మూడు రోజుల ముందే హజ్రత్ హమ్‌జా (ర) ముస్లిముగా మారిన సంగతి తెలిసింది. ఆ తరువాత ఆయన తన ఇస్లామ్ స్వీకార సంఘటన గురించి ఏకరువుపెడుతూ చివరన ఇలా అన్నారు. "నేను ముస్లిముగా మారిపోయిన తరువాత దైవప్రవక్త(స)ను అడిగాను, ఓ దైవప్రవక్తా! మనం చనిపోయినా, బ్రతికినా సత్యంపై లేమా?" అని. దానికి ప్రవక్తశ్రీ(స) "ఎందుకు లేము? ఎవరి పిడికిటనయితే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ సాక్షి! మీరు మరణించి ఉన్నా, జీవించి ఉన్నా సత్యంపైనే ఉన్నారు" అని అన్నారు. "అయితే మనం ఇలా దాగి ఉండడం దేనికి? ఎవరయితే మిమ్ములను సత్యం ఇచ్చి పంపించాడో ఆ దైవం సాక్షి! మనం తప్పకుండా బయటకు వెడదాము" అన్నాను. ఆ తరువాత మేము రెండు వరసలుగా తీరి ఆయన (స)ను వెంట బెట్టుకొని బయటకు వచ్చాము. ఓ వరసలో హజ్రత్ హమ్జా (ర), మరో వరసలో నేను ఉన్నాము. మేము నడుస్తూ ఉండగా లేచిన తేలికపాటి దుమ్ము తిరుగలి తిరిగినప్పుడు లేచే పిండిలా ఉంది. అలాగే మేము మస్జిదె హరాంలో ప్రవేశించాం. ఖురైష్ నన్నూ, హమ్‌జా (ర)ను చూడగానే వారికి ఇప్పటి వరకు కలగనంత బాధ కలిగింది. ఆనాడే దైవప్రవక్త (స) నాకు ఫారూఖ్ అనే బిరుదును ఒసిగారు.[76]

హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్ (ర) ఇలా అంటారు.

"మాకు, హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించనంత వరకు కాబా గృహంలో నమాజు చేసే శక్తి లేకుండా ఉండింది."[77]

హజ్రత్ సుహైబ్ బిన్ సినాన్ రూమీ (ర) కథనం ప్రకారం, హజ్రత్ ఉమర్ (ర) ముస్లిము అయిన తరువాతే, ఇస్లామ్ తెరమరుగు నుండి బయటకు వచ్చింది. బాహాటంగా ప్రచారం మొదలయింది. మేము చిన్న చిన్న గుంపులుగా చేరి కాబా చుట్టూ కూర్చోగలిగాము. కాబా తవాఫ్ (ప్రదక్షిణ) చేశాము. మాపై దౌర్జన్యం చేసిన వారిపై పగతీర్చుకుంటూ కొన్ని హింసలకు సమాధానం కూడా చెప్పాము."[78]

హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్ (ర) గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది.

---

*76. తారీఖ్ ఉమర్ బిన్ ఖత్తాబ్-అల్ ఇబ్నెజూజీ పుట. 6,7.*
*77. ముక్తరుస్సీరత్, షేఖ్అబ్దుల్లాహ్ పుట.103*
*78. తారీఖ్ ఉమర్ బిన్ ఖత్తాబ్ - అల్ఇబ్నె జూజీ పుట. 13.*

https://teluguislam.net



"హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించినప్పటి నుండి మేము శక్తిని పుంజుకుంటూ గౌరవంగా తిరగగలిగాము."[79]

## దైవప్రవక్త (స) సన్నిధికి ఖురైష్ దూత

ఆ రోజుల్లో, హజ్రత్ హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు ఖత్తాబ్ కుమారుడు హజ్రత్ ఉమర్ (ర) ఇద్దరూ ఇస్లామ్ స్వీకరించడం వల్ల ముస్లిములపై జరుగుతున్న ఆగడాలు కొంత తగ్గుముఖం పట్టాయి. ముస్లిములను హింసించే బహుదైవారాధకుల వైఖరి మారి, వివేకంతో కూడిన పంథాను అందుకుంది. కాబట్టి బహుదైవారాధకులు ఇక హింసాదౌర్జన్యాలతో ముస్లిములను సందేశ ప్రచారం చేయకుండా అడ్డుకోలేము అని గ్రహించి మహాప్రవక్త (స) గారితో ఆ ప్రచారాన్ని ఆపుజేయమని చెప్పడానికి బేరసారాలకు దిగవలసి వచ్చింది. అయితే ఈ అమాయకులకు, సందేశ ప్రచారానికి బదులుగా ఈ విశ్వాన్నంతటిని ఇచ్చినా అది ఆగేది కాదు అన్న విషయం ఏం తెలుసు? కాబట్టి వారు తమ ఈ ప్లానులో కూడా అపజయం పొందవలసివచ్చింది.

ఇబ్నె ఇస్హాక్, యజీద్ బిన్ జయ్యాద్ మాధ్యమంగా, ముహమ్మద్ బిన్ కఅబ్ ఉల్లేఖనాన్ని ఉటంకిస్తూ ఇలా చెప్పారు. ముహమ్మద్ బిన్ కఅబ్ ఉల్లేఖనం ఇలా ఉంది.

"జాతికి నాయకునిగా ఉన్న ఉత్బా బిన్ రబీయా, ఓ రోజు మస్జిదె హరామ్‌లో దైవప్రవక్త(స) ఓ చోట ఒంటరిగా కూర్చుని ఉండగా చూసి, ఖురైష్ నుద్దేశించి, "ఓ ఖురైష్ ప్రజలారా! ముహమ్మద్ (స) వద్దకు వెళ్ళి నేనెందుకు మాట్లాడకూడదు? ఆయన ముందు కొన్ని ప్రతిపాదనలను పెడతాను. బహుశా ఆయన వాటిని ఒప్పుకోవచ్చు. ఆయన ఒప్పుకున్న వాటిని మనం ఆయనకు ఇచ్చివేద్దాం. ఆయన్ను తన పని చేయకుండా అడ్డుకోవచ్చు ఏమంటారు?" అని అన్నాడు. అప్పటికి హజ్రత్ హమ్జా (ర) ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ఉన్నారు. ముస్లిముల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడం వారు గమనిస్తూనే ఉన్నారు.

బహుదైవారాధకులు, "ఓ అబుల్ వలీద్! వెళ్ళండి, ఆయనతో మాట్లాడండి" అని అనుమతినివ్వగా, అతను మహాప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. (అదను చూసి) "సోదర కుమారా! మా జాతిలో నీకున్న హోదా, గౌరవం,

79. సహీబుఖారి, ఇస్లామ్ అధ్యాయం, ఉమర్ బిన్ ఖత్తాబ్-1/545.

https://teluguislam.net



నీ వంశోన్నత్యం ఏమిటో నీకు బాగా తెలుసు. ఇప్పుడు నీవు నీ జాతిలో ఓ పెద్ద సమస్యను తీసుకొచ్చిపెట్టావు. దాని ద్వారా నీవు వారిలో విభేదం సృష్టిస్తున్నావు. వారి బుద్ధివివేచనలను పనికిమాలినవిగా ఖరారు చేస్తున్నావు. వారి ఆరాధ్య దైవాలను కించపరుస్తున్నావు. గతించిపోయిన వారి తాతముత్తా తల్లి దైవతిరస్కారులని అంటున్నావు. అందుకని నా మాటలను శ్రద్ధగా విను. నీ ముందు నేను కొన్ని ప్రతిపాదనలను ఉంచుతున్నాను. వాటి గురించి బాగా ఆలోచించు. బహుశా ఏదో ఒకటి నీకు నచ్చకపోదు" అని అన్నాడు. ఇది విన్న మహాప్రవక్త (స) అతనితో, "అబుల్ వలీద్! చెప్పండి. నేను మీరు చెప్పింది శ్రద్ధగానే వింటాను" అని అన్నారు.

"సోదర కుమారా! నీవు తీసుకొచ్చిన వ్యవహారం ఏదయితే ఉందో ఆ విషయంలో నీవు నీకు ఏది కావాలో చెప్పు. డబ్బు కావాలనుకుంటే నీవు మాకందరికంటే గొప్ప ధనవంతుడవయ్యేటట్లు సంపదను కూడబెట్టి నీకిస్తాము. నీకే గనక నాయకత్వంగాని హోదాగాని కావాలని అనుకుంటే చెప్పు, నిన్ను మా సర్దారుగా, నాయకునిగా చేసుకుంటాము. నీవు లేకుండా ఏ తీర్పు కూడా వెలువడడానికి వీలుండదు. నీవే గనుక మాకు రాజువు కాదలుచుకుంటే, నిన్ను మా రాజుగా చేస్తాము. నీ వద్దకు వచ్చేవాడు (జిబ్రీల్) జిన్నో, భూతమో అయితే చెప్పు, దాన్ని మేము నీ దగ్గరకు రాకుండా భూతవైద్యం చేసి పారద్రోలగలం. దీనికోసం మేము ఎంత ఖర్చుబెట్టవలసి వచ్చినా ఖర్చుబెడతాము. నీకు స్వస్థత చేకూరితే అంతే చాలు. జిన్ను, దెయ్యం, భూతం పట్టిన వానికి చికిత్స తప్పనిసరిగా చేయవలసి ఉంది" అంటూ ఏదేదో చెబుతున్నాడు ఉత్బా. దైవప్రవక్త(స) ఇదంతా వింటూ కూర్చున్నారు. తాను చెప్పేదంతా చెప్పిన తరువాత ఆయన (స) ఉత్బాను సంబోధిస్తూ,

"అబుల్ వలీద్! నీవు చెప్పడం పూర్తి అయిందా?" అని అడిగారు.

"అవును. నేను చెప్పేది చెప్పేశాను" అని అనగానే దైవప్రవక్త(స) ఇలా అన్నారు.

"అయితే నేను చెప్పేది కూడా విను! అంటూ బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం అని పఠించి; దివ్య ఖుర్ఆన్‌లోని హామీమ్ సజ్దా సూరాను పఠించ నారంభించారు.

https://teluguislam.net



حٰمٓ ۚ﴿١﴾ تَنْزِيْلٌ مِّنَ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۚ﴿٢﴾ كِتٰبٌ فُصِّلَتْ اٰيٰتُهٗ قُرْاٰنًا عَرَبِيًّا لِّقَوْمٍ يَّعْلَمُوْنَ ۙ﴿٣﴾ بَشِيْرًا وَّنَذِيْرًا ۚ فَاَعْرَضَ اَكْثَرُهُمْ فَهُمْ لَا يَسْمَعُوْنَ ﴿٤﴾ وَ قَالُوْا قُلُوْبُنَا فِيْٓ اَكِنَّةٍ مِّمَّا تَدْعُوْنَآ اِلَيْهِ

"హామీమ్! ఇది కరుణామయుడూ, కృపాశీలుడూ అయిన దేవుని సన్నిధి నుండి అవతరింపజేయబడిన; స్పష్టంగా వివరించబడిన వాక్యాలు గల గ్రంథం. అరబ్బీ భాషలో ఉన్న(ఈ) ఖుర్ఆన్, జ్ఞానుల కొరకు; ఇది శుభవార్తను ఇచ్చేది, భయపెట్టేదీను.

కాని వారిలో చాలా మంది దాని పట్ల విముఖులయ్యారు. కనుక వారు వినరు. "నీవు దేని వైపునకు మమ్మల్ని పిలుస్తున్నావో, దానిని గురించి మా హృదయాలను తెరలు కప్పివేశాయి (చివరి వరకు)."

దైవప్రవక్త(స) అలా పఠిస్తూనే ఉన్నారు. ఉత్బా తన రెండు చేతుల్ని తన వీపు వెనక భాగాన నేలకు ఆనించి నిశ్శబ్దంగా ఖుర్ఆన్ వాక్యాలను ఆలకిస్తూ ఉన్నాడు. దైవప్రవక్త(స) సజ్దా చేసే ఆయత్ పఠించి సజ్దా చేశారు. ఆ తరువాత ఉత్బాను ఉద్దేశించి,

"అబుల్ వలీద్! నీవు వినవలసినదంతా వినేశావు కదా! ఇక నీవు నీ ఇష్టప్రకారం కానీ" అని చెప్పేశారు.

ఉత్బా లేచి తన బృందం వైపునకు నడిచాడు. అతణ్ణి చూడగానే బహుదైవారాధకులు పరస్పరం ఒకరినుద్దేశించి మరొకరు, "దైవసాక్షి! అబుల్ వలీద్ ముఖం చూశారా! ఇక్కడ నుండి వెళ్ళేటప్పుడు ఉన్నట్లుగా లేడు!" అని గుసగుసలాడనారంభించారు. అబుల్ వలీద్ వచ్చి కూర్చోగానే వారు, అక్కడ ఏం జరిగింది? అని అడిగారు. అతను వారినుద్దేశించి, "దైవసాక్షిగా చెబుతున్నాను, నేను అక్కడ విన్నది నా జీవితంలో ఎప్పుడూ వినలేదు. దైవసాక్షి! అది కవిత్వంగాని, ఇంద్రజాలంగాని, జోతిష్యుల మంత్రాలుగాని కావు. ఖురైష్ ప్రజలారా! నా మాట వినండి. అతని విషయం నాకు వదిలేయండి. నా సలహా ప్రకారం అతణ్ణి అతని మానాన వదిలేసి వేరుగా కూర్చుని ఉండండి. దైవసాక్షి! నేను అతని నోట విన్న మాట ప్రకారం ఓ బ్రహ్మాండమయిన సంఘటన జరిగితీరుతుంది. ఒకవేళ అతణ్ణి మిగతా అరబ్బులు చంపేస్తే మీ పని ఇతరులు చేసిపెట్టినట్లవుతుంది. లేదా అతనే అరబ్బుల్ని జయిస్తే అతని

https://teluguislam.net



రాచరికం మీ రాచరికమే అవుతుంది. అతని గౌరవం మీ గౌరవమే. అతని అస్తిత్వం అందరికంటే మీ శ్రేయం కోసమే సుమా" అని చెప్పి ఊరకుండిపోయాడు.

దానికి, "అబుల్ వలీద్! దైవసాక్షి! అతని ఇంద్రజాలం నీపై కూడా ప్రసరించినట్లుందే!" అని వారంతా అన్నారు. అది విన్న ఉత్బా, "ఈయనగారి విషయంలో నా సలహా మాత్రం అదే. ఇక మీకు ఏది సరిగా తోస్తే అది చేయండి"[80] అని అన్నాడు.

మరో ఉల్లేఖనంలో, దైవప్రవక్త(స) గ్రంథ పఠనాన్ని ప్రారంభించాక ఉత్బా దాన్ని చాలా శ్రద్ధగా విన్నాడని, దైవప్రవక్త(స) ఈ వాక్యం (ఆయత్), **"ఇప్పుడు ఒకవేళ వారు విముఖులయితే, వారితో ఇలా అను. ఆద్, సమూద్ జాతులపై అవతరించినటువంటిదీ అకస్మాత్తుగా విరుచుకుపడేదీ అయిన ఒక శిక్షను గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను"** (41-13) పఠించగానే ఉత్బా గడగడలాడుతూ భయంతో నిలబడిపోయాడు. తన చేతిని దైవప్రవక్త (స) గారి నోటికి అడ్డం పెడుతూ, "అల్లాహ్ మరియు మన బంధుత్వాన్ని దృష్టిలో పెట్టుకొని అలా చెప్పకండి" అని వారించాడు. అతనికి, ఈ శిక్ష ఎక్కడ వచ్చి పడుతుందో అనే భయం పట్టుకుంది. ఆ తరువాత అతని బృందం వద్దకు వెళ్ళి పైన చెప్పిన మాటలే చెప్పాడు.[81]

## అబూ తాలిబ్, బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్‌లను సమావేశ పర్చడం

పరిస్థితులు మారిపోతున్నాయి. చుట్టూ ఉన్న వాతావరణంలోను మార్పు వచ్చేసింది. అయినా, అబూ తాలిబ్ మనస్సు మాత్రం ప్రమాదాన్ని శంకిస్తూనే ఉంది. బహుదైవారాధకుల వైపు నుండి తన సోదర కుమారునికి ప్రమాదం ఏర్పడగలదనే భయం మాత్రం ఆయనను వెంటాడడం మానలేదు. గతంలో జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా ఆయన కళ్ళెదుట ప్రత్యక్షమవుతున్నాయి. ఆయన కుమారుణ్ణి చంపడానికి ఆయనకు బదులుగా అమ్మారా బిన్ వలీద్‌ను ఇచ్చే బేరసారాలు చేశారు. అబూ జహల్ భారమైన బండరాయిని ఎత్తుకుని ఆయన సోదర కుమారుని తలపై వేయడానికీ ప్రయత్నం చేశాడు.

---

*80. ఇబ్నెహిష్షామ్-1/293,294.* *81. తఫ్సీర్ ఇబ్నె కసీర్-6/159,160,161.*

https://teluguislam.net



ఉక్బా బిన్ అబీముఅయిత్ దుప్పటి మెడలో వేసి గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించాడు. ఖత్తాబ్ కుమారుడు ఖడ్గం చేతబూని ముహమ్మద్ (స)ను హతమార్చడానికి బయలుదేరాడు. ఈ సంఘటలన్నింటిని మననం చేసుకుంటూ ఈ పరిస్థితిలో ఏ బహుదైవారాధకుడైనా ఆయన (స) పై విరుచుకుపడితే హజ్రత్ హమ్‌జా (ర) గాని, హజ్రత్ ఉమర్ (ర) గాని మరెవరుగాని ఎలా ఆదుకోగలరు?

అబూ తాలిబ్‌కు ఇది సాధ్యమే అనిపించింది. మొత్తానికి ఇది యదార్థం కూడాను. ఎందుకంటే, బహుదైవారాధకులు బాహాటంగా దైవప్రవక్త(స)ను హతమార్చేందుకే కంకణం కట్టుకుని ఉన్నారు. వారి ఈ నిర్ణయానికి సంబంధించిన సంకేతం దైవవాణిలోనూ అవతరించి ఉంది.

اَمْ اَبْرَمُوْٓا اَمْرًا فَاِنَّا مُبْرِمُوْنَ

**"వారు ఏదైనా చర్యను తీసుకోవడానికి నిర్ణయించుకున్నారా? అలా అయితే మేము కూడా ఒక నిర్ణయం తీసుకుంటాము."** (43-79)

ఇప్పుడు అబూ తాలిబ్ ఏం చేస్తారు అన్నదే ప్రశ్న. ఖురైష్ తన సోదరుని కుమారుణ్ణి అన్ని వైపుల నుండి వ్యతిరేకించటం చూసి, తన ముత్తాత అబ్దె మునాఫ్ కుమారులు హాషిమ్ మరియు ముత్తలిబ్ ద్వారా ఉనికిలోనికి వచ్చిన వంశం వారందరిని ఓ చోట సమావేశపరిచారు. తాను ఇప్పటి వరకు ఒంటరిగా తన సోదరుని కుమారుణ్ణి కాపాడుతూ వచ్చానని, ఇక ముందు అందరు కలిసి ముహమ్మద్ (స)ను ఖురైష్ బారి నుండి కాపాడాలని పిలుపునిచ్చారు. అబూ తాలిబ్ చేసిన ఈ అభ్యర్థనను అరబ్బుల పౌరుషం దృష్ట్యా, ఆ రెండు కుటుంబాలకు చెందిన వారంతా స్వీకరించారు. అయితే అబూతాలిబ్ సోదరుడు అబూ లహబ్ ఒక్కడు మాత్రం దీన్ని ఒప్పుకోకుండా తన కుటుంబం నుండి వేరుపడి ఖురైష్ బహుదైవారాధకులతో కలసిపోయి వారికి అండగా నిలిచిపోయాడు.[82]

*82. ఇబ్నె హష్షామ్-2/269; ముక్తతరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లా-పుట.106.*